V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

RNI No : TGTEL/25/A1676

మంగళవారం 18-08-2026

సంపుటి : 02 | సంచిక : 36 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ CMD



# 2 లక్షల మందికి ఉపాధి

**3,245 ఎకరాల విస్తీర్ణంలో జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధి**

**రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది**

**స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను 2028 మార్చి నాటికి పూర్తి చేస్తాం**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ పారిశ్రామిక స్మార్ట్ సిటీ ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల శాఖ మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని 3,245 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పారిశ్రామిక వాడలో సుమారు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులను వేగంగా కల్పిస్తూ ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. స్మార్ట్ సిటీలో

2లో

# ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం



- మా పాలనలో ఆరోగ్య శ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించాం
- విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నాం
- 2027 డిసెంబర్ లోపు ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేస్తాం
- కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తాం
- అన్ని ఆస్పత్రులు పూర్తయితే 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయి
- ప్రభుత్వ వైద్యులు అదనపు సేవలందిస్తే ప్రోత్సాహకాలు: సీఎం రేవంత్ రెడ్డి
- సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఉస్మానియా, టిమ్స్, వరంగల్ ఆస్పత్రులను తీర్చిదిద్ది పేదలకు వైద్యసేవలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన వచ్చాక విద్య, వైద్యాన్ని ప్రాధాన్యతగా తీసుకున్నామని సీఎం తెలిపారు. విద్యలో అనేక నూతన విధానాలను తీసుకొచ్చామని వివరించారు. పేదల వైద్యాన్ని తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు మన విద్యార్థులకు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

**2027 డిసెంబర్‌లోపు ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం..**

ప్రైవేటు వైద్యం ఈ రోజుల్లో అత్యంత ఖరీదు వ్యవహారంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. తమ పాలనలో ఆరోగ్యశ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించామని చెప్పారు. సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2,526 కోట్లు ఖర్చు పెట్టామన్న ఆయన, పేదల వైద్యం కోసం ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వైద్యశాఖపై రూ.21 వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. ఉస్మానియా ఆస్పత్రి కూలిపోయేలా ఉందని, పదేళ్లు అధికారంలో ఉన్న వారికి ఉస్మానియా ఆస్పత్రి కడదామనే ఆలోచన రాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టిమ్స్ ఆస్పత్రులకు టెంకాయ కొట్టిందని, నిర్మాణాన్ని మాత్రం మర్చిపోయిందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. టిమ్స్ ఆస్పత్రులు పూర్తయితే పేదల వైద్యానికి 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తామన్న రేవంత్ రెడ్డి, టిమ్స్?కు వచ్చే రోగులకు ఆహారం, ఇతర వసతులు కల్పిస్తున్నామన్నారు. రోగులతో పాటు వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.

**బీఆర్ఎస్ నేతలు పగటి వేషగాళ్లలా తయారయ్యారు..**

బీఆర్ఎస్ నేతలు పగటి

2లో

## కొండగట్టు సమీపంలో లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**5 చిన్నారులు సహా 25 మందికి గాయాలు**

**క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్‌ను బయటకు తీసిన స్థానికులు**



విశ్వంభర, కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు-లారీ ఢీకొన్నాయి. ప్రమాదంలో 25 మందికి గాయాలు కాగా, క్షతగాత్రుల్లో ఐదుగురు చిన్నారులున్నారు. వీరందరినీ స్థానికులు ఆస్పత్రికి తరలించారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి

2లో

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ యథాతథంగా కొనసాగిస్తాం

**హైకోర్టులో స్టే ఎత్తివేయించి మళ్లీ అమలు చేస్తామని స్పష్టీకరణ**


**కోర్టులో పిటిషన్ వేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్న మంత్రి పొన్నం ప్రభాకర్**



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథాతథంగా కొనసాగిస్తామని సర్కార్ స్పష్టం చేసింది. హైకోర్టు స్టేను సాకుగా చూపిస్తూ బీఆర్?ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

2లో

## ఐఎస్ఐ భారీకుట్ర భగ్నం



- "షాజాద్ భట్టి నెట్‌వర్క్" ను ధ్వంసం చేశాం
- ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేశాం
- ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ: అమిత్ షా

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఐఎస్ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనే ఉగ్రవాద గ్రూప్‌ను నాశనం చేసినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. "షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్‌లు నిర్వహించాయి.

2లో

## టీడీపీఎల్ నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు..

**ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం**

**సీఐడీతో విచారణ జరిపిస్తామన్న సీఎం హేమంత్ సోరెన్**



విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలతో ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. లఖ్‌నవూకు చెందిన ఔట్ సోర్సింగ్ సంస్థ టీడీపీఎల్ (టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్) 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. పరీక్షల్లో అక్రమాలపై విద్యార్థుల ఆందోళనల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షను సైతం రద్దు చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. 2014 నుంచి జరిగిన నియామక పరీక్షలకు సంబంధించిన చిన్న, పెద్ద తప్పులన్నింటిపైనా సీఐడీతో విచారణ జరిపిస్తామన్నారు. పరీక్షల్లో సంస్కరణల కోసం కమిటీని ఏర్పాటు చేస్తామన్న ఆయన.. దీనికి సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ సారథ్యం వహిస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో పరీక్షల కుంభకోణంలో పలు కంపెనీల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లుపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం

2లో

## టీజీ సేఫ్ కమిషనర్‌గా అవినాష్ మహంతి బాధ్యతల స్వీకరణ



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో ఆహార, నిత్యావసర ఔషధాల నాణ్యతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) తొలి కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అవినాష్ మహంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణ, ఆహార పదార్థాలు, ఔషధాల నాణ్యత, భద్రతలను నిర్ధారించే నియంత్రణ చట్రాన్ని పటిష్టం చేసే సదుద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రత్యేక అథారిటీని నెలకొల్పింది. తెలంగాణ వ్యాప్తంగా లైసెన్స్ పొందిన ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, ఫార్మా సంస్థల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో.. సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఫుడ్ సేఫ్టీ విభాగం, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను ప్రభుత్వం ఒకే ఏకీకృత పరిపాలనా చట్రం కిందకు తీసుకువచ్చింది. నాసిరకం, కల్తీ, ప్రమాదకరమైన ఆహార ఉత్పత్తులతో పాటు నకిలీ మందుల తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేయనుంది. నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, తనిఖీలను విస్తృతం చేయడం, ఇరు శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ద్వారా చట్టబద్ధమైన కఠిన చర్యలు అమలు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆహార, ఔషధ వ్యాపార సంస్థలు భారీ సంఖ్యలో కేంద్రీకృతమై ఉన్న క్యూర్ ప్రాంతంలో తొలి విడతగా ఈ ఏకీకృత వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. విస్తరిస్తున్న ఆహార, ఫార్మా రంగాల వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి

**కాషాయ దళం నూతన జాతీయ కార్యవర్గం ప్రకటన**



విశ్వంభర, నేషనల్ బ్యూరో: బీజేప నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల చేసింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్ మాధవ్ (ఢిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషీ (గుజరాత్), డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), సర్దార్ మన్‌ప్రీత్ సింగ్‌బాదల్ (పంజాబ్), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ప్రొఫెసర్ ఎం.నాగరాజ (కర్ణాటక), ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ (ఉత్తర్‌ప్రదేశ్), డాక్టర్ మధుచంద్ర కర్ (పశ్చిమబెంగాల్) చోటు దక్కించుకున్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియమితులై పార్టీలోని కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

**బీజేపీ కొత్త టీమ్ ఇదే..**

- ▶ పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత): బీఎల్ సంతోష్ (ఢిల్లీ)
- ▶ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు: శివ్‌ప్రకాశ్ (ముంబయి), సౌదన్ సింగ్ (చండీగఢ్)
- ▶ జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే (మహారాష్ట్ర), సునీల్ బన్సాల్ (ఢిల్లీ), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), స్మృతి ఇరానీ (ఉత్తర్‌ప్రదేశ్),

2లో

# రుణమాఫీపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్‌కు లేదు

- రూ.2 లక్షలలోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేశాం
- గత ప్రభుత్వం లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయలేక పోయారు
- వాయిదాల పద్ధతిలో 4 ఏళ్లు చేసిన విషయం మర్చిపోయారు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రుణమాఫీపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్ పార్టీకి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పెద్ద రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచేలా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలుస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి వ్యవహరిస్తున్నదని స్పష్టం చేశారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలయాతో ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి, అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే రూ.2 లక్షలలోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేశామన్నారు. ఈ నిర్ణయం దేశంలోనే ఒక మైలురాయిగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమైనవని, పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే అని మండిపడ్డారు. వారు అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో రుణమాఫీ చేసిన విధానం రైతులకు ఇంకా గుర్తుందని.. రైతులు వారిని పాతళంలోకి తొక్కినప్పటికీ సోయి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.లక్ష రుణమాఫీని సరిగా చేయలేని బిఆర్ఎస్ పెద్దలు, ఇప్పుడు

2లో

# ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం



వేషగాళ్ల మాదిరిగా తయారై హడావుడి చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామనేలోపే ఇక్కడికి వచ్చి హడావుడి చేస్తున్నారన్నారు. ఇక్కడికి వచ్చి టిమ్స్‌ను పరిశీలించి ఇది వాళ్లే కట్టామంటున్నారన్నారు. ఈ సందర్భంగా సనత్ నగర్ ఎమ్మెల్యే తీరుపై సీఎం ఛలోక్తులు విసిరారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్జరీలు చేసే డాక్టర్లకు ఇన్సెంటివ్స్ ఇస్తామన్నారు. పేదలకు విశ్వాసం కలిగిసస్తే మన జన్మసార్ధకం అయినట్లేనన్నారు. విద్యార్ధులకు ఉచిత విద్య, సాంకేతిక నైపుణ్యం అందిస్తే వాళ్లే బతుకుతారు. ఎవరూ ఇష్టంతో సంక్షేమ పథకాలు తీసుకోరు, కష్టం వస్తేనే తీసుకుంటారన్నారు. ప్రజలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా విధానాలు అమలు చేస్తే సంక్షేమ పథకాలు కోరుకోరన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ యథాతథంగా కొనసాగిస్తాం



విమర్శించారు. కోర్టు వివరణ అడిగినంత మాత్రాన పథకాలు నిలిచిపోయే పరిస్థితి లేదని తెలిపారు. ఇప్పటివరకు ఇచ్చినట్లే ఇకపైనా మూడు నెలల్లోనే కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తామని మంత్రులు వెల్లడించారు. రాష్ట్రంలో అమలవుతున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే విధిస్తూ హైకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఐతే ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన అమాత్యులు బీఆర్?ఎస్ నాయకులు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే స్టే తొలగించేందుకు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టు స్టేను సాకుగా చూపిస్తూ బీఆర్?ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

### పథకాలు నిలిపివేయాలన్న ఉద్దేశం లేదు..

గతంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్న మంత్రి వాకిటి శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే నోడల్ ఏజెన్సీ ద్వారా, గ్రీన్ ఛానల్ విధానంలో నిధులు వేగంగా విడుదల చేశామని గుర్తుచేశారు. ప్రభుత్వానికి ఈ పథకాలు నిలిపివేయాలన్న ఎలాంటి ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే నిధుల విడుదలలో ఇబ్బందులు ఉన్నాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పరిష్కరించే ప్రయత్నం చేశామని చెప్పారు. బీఆర్?ఎస్ నేతలు గతంలోనే ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించి ఉంటే ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

### బాధ్యులపై చర్యలు తప్పవు..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై కోర్టులో పిటిషన్ వేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ పథకాల అమలులో అధికారుల స్థాయిలో ఏమైనా లోపం జరిగిందా అనే కోణంలోనూ విచారణకు ఆదేశించింది. ఇందుకు బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని సర్కార్ స్పష్టంచేసింది.

### పథకం అమలుపై కోర్టు స్టే..

తెలంగాణలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ ఇటీవల హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాల అమలు కోసం 2014 నుంచి జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) అమలుపై కోర్టు స్టే విధించింది. అలాగే వీటి కింద ఎంపికైన లబ్ధిదారులకు ఎలాంటి చెల్లింపులు చేయకూడదని ఆదేశించింది. ఈ పథకాలకు సంబంధించిన జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్?గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం జస్టిస్ ఎన్.వి.శ్రవణ్?కుమార్ ఈ అంశంపై విచారణ చేపట్టారు. వాదనల సందర్భంగా ఈ పథకాల అమలు కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు రాజ్యాంగపరమైన చెల్లుబాటు లేదని పిటిషనర్ వాదించారు.

# కొండగట్టు సమీపంలో లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నిజామాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మరోవైపు ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. బాధితులకు మెరుగైన చికిత్సను అందించాలని అధికారులను ఆదేశించారు. : ప్రమాదానికి గురైన బస్సు కరీంనగర్-1 డిపోనకు చెందిన కాగా, దీనిలో సుమారు 60 మందికిపైగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంతో బస్సు డ్రైవర్ మురళి బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్నారు. స్థానికుల సాయంతో ఆయనను బయటకు తీశారు. ఆయనతో పాటు క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులకు వైద్యులు మెరుగైన చికిత్సను అందిస్తున్నారు. ఈ ప్రమాదం జరగడంతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచింది. . దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. మల్యాల సీఐ రాజ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే గాయపడ్డ వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆస్పత్రికి తరలివస్తున్నారు. దీంతో అస్పత్రి ప్రాంగణమంతా వారి బంధువులతో కిక్కిరిసింది. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని వారంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొండగట్టు ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు జగిత్యాల కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి ఆయన ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని అధికారులకు పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి

డా.సతీష్ పూనియా (రాజస్థాన్), గజేంద్ర పటేల్ (మధ్యప్రదేశ్), హరీష్ ద్వివేది (ఉత్తర్‌ప్రదేశ్), సంజయ్ భాటియా (హరియాణా)

- ▶ జాతీయ కార్యదర్శులు: కవిత పటిదార్ (మధ్యప్రదేశ్), సురేంద్రన్ (కేరళం), డా.భోలా సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్), డా ప్రదీప్ వర్మ (ఝార్ఖండ్), జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్ (గుజరాత్), డా సందీప్ పాఠక్ (ఢిల్లీ), ఫాంగ్నాన్ కొన్యాక్ (నాగాలాండ్), సంగీత యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), అనిల్ ఆంటోనీ (కేరళం), డా ఎం.వెంకటేశన్ (తమిళనాడు), మనోజ్ తిగ్గ (పశ్చిమబెంగాల్), సిద్ధార్థ్ శంభు (బిహార్), డా.స్వదేశ్ సింగ్ (ఢిల్లీ), మృగంకా దేవ్ బర్మన్ (అస్సాం), రోహన్ గుప్తా (గుజరాత్), జయప్రకాశ్ (ఢిల్లీ)
- ▶ జాతీయ కోశాధికారి: పీయూష్ గోయల్ (మహారాష్ట్ర)
- ▶ జాతీయ సంయుక్త కోశాధికారి: రాజేశ్ మంగల్ (రాజస్థాన్)
- ▶ సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి: తరుణ్ చుగ్ (పంజాబ్)
- ▶ సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శి : మహేంద్ర పాండే (ఉత్తరాఖండ్)
- ▶ నార్త్ ఈస్ట్ కోఆర్డినేటర్- డా సంబిత్ పాత్రా (ఒడిశా)
- ▶ నార్త్ ఈస్ట్ జాయింట్ కోఆర్డినేటర్ - రాజీవ్ బబ్బర్ (ఢిల్లీ)
- ▶ ఆల్ సెల్స్ కోఆర్డినేటర్: విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్)
- ▶ ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్స్: రితురాజ్ సిన్హా (బిహార్), విష్ణువర్ధన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్)

మోర్చా ప్రెసిడెంట్స్

- ⇨ యువమోర్చా: డా. హేమాంగ్ జోషి (గుజరాత్)
- ⇨ మహిళా మోర్చా : రూప్ కుమారి చౌధరి (ఛత్తీస్‌గఢ్)
- ⇨ ఓబీసీ మోర్చా : అమర్‌పాల్ మౌర్య (ఉత్తర్‌ప్రదేశ్)
- ⇨ కిసాన్ మోర్చా - బన్సిలాల్ గుర్జర్ (మధ్యప్రదేశ్)
- ⇨ ఎస్సీ మోర్చా : శివేష్ కుమార్ రామ్ (బిహార్)
- ⇨ ఎస్టీ మోర్చా : డా మన్నాలాల్ రావత్ (రాజస్థాన్)
- ⇨ మైనార్టీ మోర్చా - కున్వర్ బాసిత్ అలీ (ఉత్తర్‌ప్రదేశ్)
- ⇨ మీడియా కన్వీనర్: అనిల్ బలూని (ఉత్తరాఖండ్)
- ⇨ మీడియా కో-కన్వీనర్లు: ఆశీష్ ఉషా అగర్వాల్ (మధ్యప్రదేశ్), ప్రదీప్ భండారి (ఢిల్లీ), సిద్ధార్థ్ యాదవ్ (ఢిల్లీ)
- ⇨ సోషల్ మీడియా కన్వీనర్: దీపక్ మస్కే (ఛత్తీస్‌గఢ్)
- ⇨ సోషల్ మీడియా కో-కన్వీనర్లు: ప్రీతి గాంధీ (మహారాష్ట్ర), శివానంద్ ద్వివేది (ఢిల్లీ), అలోక్ భట్ (ఉత్తరాఖండ్), అరుణ్ యాదవ్ (హరియాణా)

మరోవైపు, త్వరలోనే కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ ఆఠవాలే వెల్లడించారు. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగత మార్పులు చేసిన నేపథ్యంలో కొత్తవారికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తాజాగా ప్రకటించిన జాతీయ కార్యవర్గం, ఇతర ముఖ్య పదవుల్లో తెలంగాణ నుంచి ఎవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

## రుణమాఫీపై మాట్లాడే నైతికత
# బీఆర్ఎస్‌కు లేదు



రైతులపై కపట ప్రేమ చూపెడుతున్నారని అన్నారు. లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయలేక వాయిదాల పద్ధతిలో 4 ఏళ్లు చేసిన విషయం మర్చిపోయారని అన్నారు. దాంతో రైతులకు రుణమాఫీ కాకపోగా.. రూ.2,630 కోట్ల వడ్డీ భారం పడిందన్నారు. వారి లోపభూయిష్ట విధానాలు పరిశీలించిన తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్న, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయంతో, రైతులకు ఎలాగైనా ఒకేసారి పంట రుణమాఫీ చేయాలనే కృతనిశ్చయంతో రూ.20,616.89 కోట్ల పంట రుణమాఫీని ఏకకాలంలో చేశామని, దాంతో 25,35,964 మంది రైతులు లబ్ధిపొందారని మంత్రి తుమ్మల అన్నారు. కొన్ని ఖాతాల్లో లోపాలు ఉన్నప్పటికీ, వాటిని సరిచేయడానికి అధికారులు గ్రామాల వారీగా వెళ్లి ప్రయోజనం అందేలా కృషి చేశారని తెలిపారు. ఇది ఈ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అని అన్నారు.

# 2 లక్షల మందికి ఉపాధి

పరిశ్రమలు పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన అనంతరం ప్రత్యక్ష, పరోక్ష రంగాల్లో కలిపి 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్‌బాబు వివరించారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం భూమి రూపంలో 51 శాతం వాటాను సమకూరుస్తుండగా, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను సమర్పించినట్లు వెల్లడించారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ విధానంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. పారిశ్రామిక స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలు ప్రారంభమైన తర్వాత అవసరమైన మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం భవ్య పథకం కింద దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌ను శ్రీధర్‌బాబు కోరారు. తెలంగాణలో పారిశ్రామిక వృద్ధికి ఈ పార్కులు మరింత ఊతమిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఐఎస్ఐ భారీకుట్ర భగ్నం

200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్దఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి" అని అమిత్ షా తెలిపారు. ఇదిలా ఉండగా.. గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు.ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్) అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. భట్టీపై ఎన్ఐఏ పలు కేసులను దర్యాప్తు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొంటూ ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# టీడీపీఎల్ నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు..

ఉందన్నారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు గత 24 రోజుల నుంచి నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చడం, ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

# 22ఏ అప్‌డేట్‌లో పొరపాటు..

విశ్వంభర, హైదరాబాద్: ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 అప్లికేషన్లు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడారు. "22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగింది. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నాం. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దు" అని పొంగులేటి అన్నారు.



# సీఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది: హరీశ్‌రావు

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అందుకే, జాబితా నుంచి తొలగించాలని హడావుడి చేస్తున్నారని విమర్శించారు. మీడియాతో హరీశ్‌రావు చిట్‌చాట్ నిర్వహించారు."సీఎం పరిస్థితే అలా ఉంటే.. ప్రజల పరిస్థితి ఏంటి?నిషేధిత జాబితాలో ఆస్తులు ఎందుకు పెట్టారో విచారణ జరిపించాలి. ఎన్ని ఆస్తులు అలా పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఆ జాబితా నుంచి ఎప్పటిలోపు తొలగిస్తారో ప్రభుత్వం చెప్పాలి. నిషేధిత జాబితా భూముల గురించి ఆర్టీఐ ద్వారా అడుగుతుంటే సమాధానం లేదు" అని హరీశ్‌రావు అన్నారు.




# మా పాపను బతికించారు.. మీరే పేరు పెట్టండి..!

విశ్వంభర, ఖమ్మం : తమ కుమార్తెకు పునర్జన్మనిచ్చిన కమిషనర్‌కు ఓ తల్లిదండ్రులు వినూత్నంగా రుణం తీర్చుకున్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ వద్దకు వచ్చి తమ కుమార్తెకు పేరు పెట్టాలని కోరారు. ఈ ఆసక్తికర ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఖమ్మం జిల్లాకు చెందిన కాంపాటి రాకేశ్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. 12 రోజుల తర్వాత చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు తెలిసింది. దీంతో ఖమ్మం నగరపాలక సంస్థలో కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న చిన్నారి నానమ్మ నరసమ్మ ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య.. హృదయ స్వచ్ఛంద సంస్థ, ప్రభుత్వం తరఫున పాప శస్త్ర చికిత్సకు రూ.14 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. జులై 28న ఆపరేషన్ జరిగి చిన్నారి కోలుకుంది. దీంతో తమ కుమార్తెను కమిషనరే కాపాడారంటూ ఆ తల్లిదండ్రులు ఉద్వేగానికి లోనయ్యారు. తమ బిడ్డకు ఆయనే పేరు పెట్టాలని సోమవారం ఉదయం ప్రజావాణికి తీసుకొచ్చారు. కమిషనర్ సంతోషం వ్యక్తం చేస్తూ.. చిన్నారికి 'జస్విక శ్రీ' అని నామకరణం చేశారు.



## తెలంగాణలో 'సర్' ముసాయిదా విడుదల..
# జాబితాలో మీ పేరుందా?




విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ముసాయిదాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. 92 లక్షల మందికి నోటీసులు ఇస్తామన్నారు. 73 లక్షల మంది ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్) జాబితాలో ఉన్నారని సీఈవో తెలిపారు. నోటీసులు అందుకున్న వ్యక్తులకు సెప్టెంబర్ 16 వరకు గడువుందని.. ఆలోపు సమాధానం ఇవ్వాలని చెప్పారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

### మీ ఓటు ఉందో, లేదో తెలుసుకోవడం ఎలా?

ముందుగా ఈసీఐ అధికారిక వెబ్‌సైట్ https://www.eci.gov.in/ను సందర్శించండి.
పైన ఉన్న SIR-2026 Download Electroal Rollపై క్లిక్ చేయండి ఆ తర్వాత వచ్చిన విండోలో తెలంగాణ లేదా ఆంధ్రప్రదేశ్ ఎంచుకోండి. ఆ తర్వాత మీ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, భాష సెలక్ట్ చేసుకోగానే కిందన ఓటరు జాబితాలు వరుస క్రమంలో కనిపిస్తాయి. అందులో మీ పార్ట్ నంబర్/పేరును సెలక్ట్ చేసి పైన కనిపించే క్యాప్చాకోడ్‌ను ఎంటర్ చేసి డౌన్‌లోడ్‌పై క్లిక్ చేయగానే.. మీ ఓటరు జాబితా పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ అవుతుంది. దాంట్లో మీ సీరియల్ నంబర్‌తో లేదా మీ పేరు/ఎపిక్ నంబర్లతో చెక్ చేసుకోవచ్చు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..
# రాహుల్ గాంధీకి ఊరట

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో నివేదికను అలహాబాద్ హైకోర్టులో సమర్పించొద్దని ఈడీ, సీబీఐలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ జరిగేవరకు ముందుకు తీసుకువెళ్లొద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది. ఈ విషయం అంత తీవ్రమైనదైతే.. ఇన్నాళ్లూ దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనం వహించాయని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన భాజపా నేత దర్యాప్తు సంస్థలకు చేసిన ఫిర్యాదుపై గతంలో అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని ఈడీ, సీబీఐలను ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ.. రాహుల్ గాంధీ సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. కేసును దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది.





# కావేరి జలాల వివాదం..
### 'సుప్రీం'లో విజయ్ సర్కార్‌కు ఊరట

విశ్వంభర, నేషనల్ బ్యూరో: కావేరి నదీజలాల విషయంలో సుప్రీంకోర్టులో సీఎం విజయ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. తమిళనాడుకు నీటి విడుదలపై కావేరి నదీ జలాల నిర్వహణ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ఆదేశాలు అమలయ్యేలా చూడాలని కర్ణాటక ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 24కు వాయిదా వేసింది. అప్పుడే నీటి విడుదలపై స్టేటస్‌ను వెల్లడించాలని సూచించింది.కర్ణాటక నుంచి తమిళనాడుకు 15 రోజుల పాటు రోజూ 3,500 క్యూసెక్కుల నదీ జలాలను విడుదల చేయాలని సీడబ్ల్యూఎంఏ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనిపై కర్ణాటక నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే కావేరి నీటిలో తమ వాటాను విడుదల చేయడంలో కర్ణాటక ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. తాజాగా విచారణ జరిగింది.

# ఓటుకు నోటుపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఎన్నికల సమయంలో లెక్కల్లో చూపని నల్లధనాన్ని ఉపయోగిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టడం కేవలం నేరం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్య మూలాలకే పెద్ద ముప్పని సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 2014 నాటి కర్ణాటక ఉపఎన్నికల కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నోంగ్‌మైకాపమ్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎన్నికల్లో నల్లధన ప్రవాహాన్ని అరికట్టేందుకు సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఓటర్లకు లంచాలు ఇవ్వడం వల్ల ప్రజల స్వేచ్ఛాయుత భావప్రకటనా హక్కు దెబ్బతింటుందని, వేరొకరి ఎంపికను బలవంతంగా రుద్దడమే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ వర్సెస్ రాజ్ నారాయణ్, అనూప్ బరన్వాల్ కేసులలో రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను, వోహ్రా కమిటీ, లా కమిషన్ నివేదికలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘానికి విస్తృత అధికారాలు ఉన్నాయని స్పష్టం చేసింది.

### కేసులు పెండింగ్, విత్‌డ్రాలపై ఆందోళన..

దేశంలో నమోదవుతున్న ఎన్నికల కేసుల విచారణ తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో నమోదైన దాదాపు 3.87 లక్షల ఎఫ్ఐఆర్‌లలో కేవలం 42.9 శాతం మాత్రమే శిక్షలతో ముగిశాయని, మిగిలినవి విచారణలో జాప్యం జరుగుతోందని కోర్టు పేర్కొంది. ముఖ్యంగా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారగానే ప్రజాప్రతినిధులపై ఉన్న ఎన్నికల కేసులను ఏకపక్షంగా ఎత్తివేయడం నేరస్థులకు తప్పుడు సంకేతాలను ఇస్తుందని, ఇది శిక్ష నుంచి సులభంగా తప్పించుకోవచ్చనే ధోరణిని పెంచుతుందని ధర్మాసనం ఎత్తిచూపింది.

### నల్లధన నియంత్రణకు కఠిన మార్గదర్శకాలు..

ఈ వ్యవస్థాగత ముప్పును అరికట్టేందుకు సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను విధించింది. ఎన్నికల సమయంలో అధికారులు స్వాధీనం చేసుకునే రూ. 10 లక్షలు దాటిన నగదు లేదా ఆస్తుల వివరాలను 24 గంటల్లోగా సంబంధిత మేజిస్ట్రేట్ లేదా కోర్టుకు, అలాగే ఆదాయపు పన్ను శాఖకు నివేదించాలని ఆదేశించింది. నమోదైన ఎఫ్ఐఆర్‌లపై ఏడాదిలోనే విచారణ పూర్తి చేయాలని, ప్రతి త్రైమాసికంలో కేసుల పురోగతి నివేదికను ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని స్పష్టం చేసింది. అభ్యర్థులు, ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

### నవంబర్ 18 డెడ్‌లైన్..

రాజకీయ నాయకులపై ఉన్న కేసులను విచారణ లేకుండా ఏకపక్షంగా ఉపసంహరించుకోవడానికి ఇకపై వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకసారి నమోదు చేసిన ఎన్నికల కేసులను ఉపసంహరించుకోవాలంటే హైకోర్టు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తేల్చిచెప్పింది. పెండింగ్‌లో ఉన్న 2024 లోక్‌సభ, 2019-25 అసెంబ్లీ ఎన్నికల కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ట్రయల్ కోర్టులను ఆదేశించింది. ఈ కొత్త నిబంధనల అమలుపై 2026, నవంబర్ 18 నాటికి నివేదిక సమర్పించాలని ఎన్నికల సంఘం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

# మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన..

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తమ కష్టాలను చెప్పుకొనేందుకు ప్రజలు జిల్లా కేంద్రాలు, రాష్ట్ర రాజధాని దాకా వెళ్లే వ్యయప్రయాసలను తప్పిస్తూ.. ముంగిటకే పాలనను తీసుకెళ్లే లక్ష్యంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. తొలిరోజే ప్రజల నుంచి భారీగా స్పందన రాగా.. మొత్తం 5,410 వినతులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. పది వేల మందికి పైగా అధికారులు.. రాష్ట్రంలోని 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాలతో పాటు సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 566 కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ఉదయం నుంచే తమ సమస్యల పరిష్కారం కోసం బారులు తీరిన ప్రజల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్జీదారుల సౌకర్యార్థం శాఖలవారీగా డెస్కులు, మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్ డెస్కులతో పాటు మంచినీటి వసతిని కల్పించారు.




ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని అడిగి తెలుసుకున్నారు. అర్జీల్లో కరీంనగర్ టాప్ రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి సగటున 164 అర్జీలు అందాయి. అత్యధిక వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ జిల్లాలో ఏకంగా 704 మంది బాధితులు అధికారులకు ఫిర్యాదులు సమర్పించారు. మండలాల సగటులోనూ కరీంనగర్ ముందంజలో ఉంది. అక్కడ ఒక్కో మండలానికి సగటున అత్యధికంగా 47 ఫిర్యాదులు రావడం గమనార్హం.

### సత్వర పరిష్కారమే లక్ష్యం మండల స్థాయి ప్రజావాణి....

ప్రజావాణి విజయవంతమైన నేపథ్యంలో.. కార్యక్రమ వివరాలను ప్రజావాణి రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానికంగానే వినతులు స్వీకరించడం ద్వారా పాలన ప్రజలకు మరింత చేరువవుతుందని వారు అభిప్రాయపడ్డారు. సోమవారం స్వీకరించిన వినతులను ఆయా సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు.

# నాలుగు నెలల్లో 22 మందికి మరణశిక్ష..!



విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ కోర్టు సంచలన తీర్పులతో వార్తల్లో నిలిచింది. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ గత నాలుగు నెలల్లో విచారించిన 10 కేసుల్లో.. ఏకంగా 22 మందికి మరణశిక్ష విధించారు. న్యాయవాది హత్య నుంచి కిడ్నాప్, దోపిడీ వంటి పలు కేసుల్లో దోషులుగా తేలిన వారికి ఈ శిక్షలు పడ్డాయి. గతంలో బరేలీలో పనిచేసిన సమయంలోనూ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్.. 13 మందికి మరణశిక్ష విధించారు. దీంతో ఇప్పటివరకు ఆయన విధించిన మరణశిక్షల సంఖ్య 35కు చేరింది. 2022లో వారణాసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు సముదాయంలో వీడియో సర్వేకు ఆదేశించి ఆయన జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఇటీవల కాలంలో వరుసగా మరణశిక్షలు విధించడంతో 'అత్యంత అరుదైన కేసుల్లోనే' ఈ శిక్ష విధించాలన్న న్యాయసూత్రంపై చర్చ మొదలైంది. అయితే సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్ష తుది తీర్పు కాదు. హైకోర్టు ధ్రువీకరించిన తర్వాతే దాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ హైకోర్టు ధ్రువీకరించినా.. పైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.

# నాంపల్లి కోర్టులో వర్చువల్‌గా హాజరైన అల్లు అర్జున్..
### సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు విచారణ వాయిదా

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసు విచారణ సోమవారం నాంపల్లి కోర్టులో జరిగింది. ఈ కేసుకు సంబంధించి ప్రముఖ నటుడు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టు ముందు వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన 'రాకా' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం, ముంబైలో మకాం వేసి ఆ షెడ్యూల్‌లో పాల్గొనాల్సిన పరిస్థితి ఉండటంతో.. కోర్టుకు నేరుగా కాకుండా వర్చువల్‌గా విచారణకు హాజరై తన వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం, వాటిని నమోదు చేసుకుని తదుపరి విచారణను సెప్టెంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. కాగా, 2024 డిసెంబర్ 4న 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ రావడంతో సంధ్య థియేటర్ వద్ద భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట వాతావరణం నెలకొంది. ఈ దుర్ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాద ఘటన



నేపథ్యంలో నమోదైన కేసులో భాగంగానే న్యాయస్థానం ఈ విచారణను చేపట్టింది. కేసులో అల్లు అర్జున్‌ను ఏ-11 నిందితుడిగా ఉన్నారు. థియేటర్ యాజమాన్యం, కార్యక్రమ నిర్వాహకులు, భద్రతా సిబ్బంది తదితరులను కూడా నిందితులుగా పేర్కొంటూ మొత్తం 23 మందిపై గతంలో పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్ ర్యాలీ
### ఖర్గేను అవమానించిన బీజేపీ నేతలవైఖరికి నిరసన
### పాల్గొన్న ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్, జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి తదితరులు




విశ్వంభర, సంగారెడ్డి: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించిన బీజేపీ నేతల వైఖరికి నిరసనగా సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నేరెళ్ల శారద, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, దుద్దిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను మరుసటి రోజు 'శుద్ధీకరణ' పేరుతో గంగాజలంతో శుభ్రం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. కుల, మత విద్వేషాలతో దేశాన్ని విభజించే ప్రయత్నాలను తిప్పికొడతామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.సంగారెడ్డిలోని ఐబీ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయం సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌహార్దం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం పోరాడతారని నాయకులు పేర్కొన్నారు.

### దళితుల పట్ల వివక్షను ఖండించిన దీపక్ రాథోర్..

ఈ సందర్భంగా ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్ మాట్లాడుతూ.. చంద్ర మండలానికి ప్రయాణిస్తున్న ఈ కాలంలో కూడా బీజేపీ నేతలు దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ధ్వజమెత్తారు. మల్లికార్జున ఖర్గే దళితుడు కావడం వల్లే వేదికను 'శుద్ధీకరణ' చేశారని ఆరోపించారు. కులం, మతం పేరుతో బీజేపీ నాయకులు దేశాన్ని విభజిస్తున్నారని విమర్శించారు.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులు, యువత, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారాల కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజంలో ఐక్యత, పరస్పర సౌహార్దం, సామరస్యం కొనసాగేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని దీపక్ రాథోర్ పేర్కొన్నారు.

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది..

కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్' కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని ఏఐసీసీ పరిశీలకుడు దీపక్ రాథోర్ తెలిపారు. మరో 5--7 రోజుల పాటు జిల్లాలో పర్యటించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే..
# జీతంలో 20శాతం కోత

విశ్వంభర, నేషనల్ బ్యూరో: బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా..



జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

# కబ్జాల కోరల్లో కాలనీలు.. కాపాడాలంటూ 'హైడ్రా'కు 52 ఫిర్యాదులు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: లే ఔట్‌లలోని రహదారులను, పార్కులను కబ్జా చేసేస్తున్నారు. పక్క కాలనీలకు దారులు లేకుండా గోడలు కడుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్పేట్ గ్రామంలోని సర్వే నంబరు 668 నుంచి 674 వరకూ ఉన్న 28 ఎకరాల మేర గ్రీన్‌ఫీల్డ్ కాలనీ పేరిట 1991లో లే ఔట్ వేశారు. 2018లో ఇందులోని కొన్ని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ కూడా అయ్యాయి. ఇదే లే ఔట్‌కు చెందిన భూమిని మళ్లీ వేరే వ్యక్తులకు అమ్మేయగా వాళ్లు పాత లే ఔట్‌ను మాయం చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ లే ఔట్‌లో రహదారులు, పార్కులను కాపాడుతూ.. పాత లే ఔట్‌కు ప్రాణం పోయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మదీనాగూడ ఆర్టీసీ కాలనీలో 402 చదరపు గజాల స్థలాన్ని లేఅవుట్‌లో వైద్య సదుపాయం, ప్రజా అవసరాల కోసం కేటాయించారు. ఈ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు



విక్రయించినట్లు ఆరోపిస్తూ ఆర్టీసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించాలని వారు కోరారు. ఇలా హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు అందాయి. వీటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి.. పరిష్కారానికి సంబంధిత అధికారులకు అప్పగించారు.

## పరీక్షల్లో అవకతవకలు.. ఎన్‌టీఏలో 50మందిపై వేటు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలపై కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడంతో జాతీయ పరీక్షల ఏజెన్సీ కీలక చర్యలు చేపట్టింది. పరీక్షా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా 50మందికి పైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలోని కీలక స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ప్రకటన వెలువరించింది. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ వంటి పది కొత్త స్థానాల కోసం ప్రకటనలు జారీ చేసి, నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపింది. సైబర్ భద్రత, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఇతర ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేట్ రంగం నుంచి కూడా నిపుణులను తీసుకువస్తున్నట్లు వెల్లడించింది.నిర్దేశిత పరీక్షా విధానాలను కచ్చితంగా పాటించాలని విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాల గోప్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక గదులు , ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్ (ఇంటర్నెట్‌తో సంబంధం లేని వ్యవస్థలు), పరికరాలను భద్రపరిచే విధానాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, నివేదిక సమర్పించాలని ఎన్‌టీఏను ఆదేశించారు. సోమవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి.. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సహా ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కి వ్యతిరేకంగా ఇటీవల దిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా వేలాదిమంది యువతతో పాటు ప్రతిపక్షాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తాజాగా ప్రశ్నపత్రాల్లో పలు తప్పులు దొర్లాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో యూజీసీ నెట్ - ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఎన్‌టీఏ ప్రకటించింది. మరుసటి రోజే ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# విమలక్క గళం.. ఐదు దశాబ్దాల ప్రజా ఉద్యమ చరిత్ర..

**ప్రజల పాట అనేది కేవలం వినోదం కాదు. అది ఒక కాలపు కన్నీటి చరిత్ర. ఒక సమాజపు ఆకాంక్ష. ఒక శిక్షిత ఆవేదన. ఒక ఉద్యమానికి ఆయుధం. ప్రజల జీవితాల్లోంచి పుట్టిన పాట ప్రజల గుండెల్లోకి చేరినప్పుడు అది కేవలం స్వరం కాదు.. చైతన్యంగా మారుతుంది. అలాంటి పాటను తన జీవితంగా మలుచుకుని, తన గళాన్ని ప్రజల గొంతుకగా మార్చుకుని, తన అడుగులను అణగారిన వర్గాల విముక్తి బాటలో నడిపించిన ప్రజాగాయని విమలక్క. ఆమె తన ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంలో ఆమెను అభినందించడం అంటే ఒక వ్యక్తిని సన్మానించడం మాత్రమే కాదు.. ప్రజా సాంస్కృతిక ఉద్యమం సాగించిన చారిత్రక ప్రయాణాన్ని గుర్తు చేసుకోవడం కూడా.**



ఈ సందర్భంగా ప్రజా కళా జాతర 50 గంటల పాటు జరపడం ఆహ్వానించి దగ్గర పరిణామం.పాట పుట్టింది నేల తల్లి కోసం.. గళం వినిపించింది ప్రజల కోసం.. అడుగు పడింది విముక్తి కోసం.. పోరాటం సాగింది బహుజనుల కోసం.. ఈ నాలుగు వాక్యాలు విమలక్క ప్రస్థానానికి అద్దం పడతాయి. పల్లె మట్టి నుంచి పుట్టిన ఆలేరు అనుభవం, అణచివేతను చూసిన కళ్లలోంచి వచ్చిన ఆవేదన, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, సమానత్వాన్ని కోరుకునే తపన ఆమె పాటకు జీవం పోశాయి. అందుకే ఆమె పాట వేదిక మీద వినిపించే గానం మాత్రమే కాదు.. వేదిక దాటి ప్రజల జీవితాల్లోకి వెళ్లే ఉద్యమ స్వరం.విమలక్కకు వచ్చిన ఈ పోరాట స్ఫూర్తి వ్యక్తిగతంగా ఒక్కరోజులో ఏర్పడినది కాదు. తండ్రి బండ్రు నర్సింలు అందించిన పోరాట వారసత్వం, కుటుంబంలో పెరిగిన సామాజిక చైతన్యం, ప్రజా ఉద్యమాలతో ఏర్పడిన అనుబంధం, అమర్ అన్న పాటల సాహిత్య వారసత్వం ఆమెగాన ప్రస్థానానికిబలమైన పునాదులయ్యాయి. విమలక్క-మిత్ర అనుబంధాన్ని వివరించే రచనల్లో కూడా వారి గానం తెలంగాణ ఉద్యమ భావజాలంతో, ప్రజా పోరాటాలతో ఎంతగా ముడిపడి ఉన్నదో కనిపిస్తుంది. పాటను రాసిన వారు ఒక వైపు, దానికి ప్రాణం పోసిన గళం మరోవైపు ఉన్నప్పటికీ, ఆ రెండు కలిసినప్పుడు అది ఒక ఉద్యమ భాషగా రూపుదిద్దుకుంది.తెలంగాణ చరిత్రలో పాటకు ఉన్న స్థానం ప్రత్యేకమైనది. అక్షరాలు చేరని చోట పాట చేరింది. పుస్తకాలు చదవలేని ప్రజల మధ్య పాట చరిత్రను చెప్పింది. సభలకు రాలేని జనాన్ని పాట కదిలించింది. బాధను వ్యక్తం చేయలేని వారి తరఫున పాట మాట్లాడింది. అందుకే తెలంగాణ ఉద్యమాల చరిత్రను పాటల చరిత్ర నుంచి వేరు చేసి చూడలేం. విమలక్క ఆ ప్రజా గాన సంప్రదాయానికి ఒక శక్తివంతమైన ప్రతినిధిగా నిలిచారు. ఆమె గళంలో వినిపించిన పాటకు డప్పు తాళం మాత్రమే కాదు.. ప్రజల గుండె చప్పుడు కూడా ఉంది.ఆమె పాటలో పల్లె ఉంది. కూలీ ఉంది. మహిళ ఉంది. బహుజన జీవితంఉంది.అణచివేతకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉంది. సమానత్వం కోసం ఆరాటం ఉంది. తెలంగాణ నేల పట్ల ప్రేమ ఉంది. స్వేచ్ఛ పట్ల ఆకాంక్ష ఉంది. అందుకే ఆమె పాటను ఒకే రాజకీయ సందర్భానికి పరిమితం చేయడం సాధ్యం కాదు. ఒక ఉద్యమం ముగిసిన తర్వాత పాటకూడా ముగిసిపోవాలి అన్నది ఆమె ప్రయాణం చెప్పే సత్యం కాదు. ప్రజల జీవితాల్లో అసమానతలు ఉన్నంతకాలం, సామాజిక అన్యాయం ఉన్నంతకాలం, అణచివేత ఉన్నంతకాలం ప్రజా పాటకు అవసరం ఉంటుంది.ఇక్కడే విమలక్క ప్రస్థానం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. కాలం మారింది. రాజకీయ పరిస్థితులు మారాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. పాలకులు మారారు. ప్రభుత్వాలు మారాయి. కానీ సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోయాయా? బహుజన వర్గాలకు సమాన అవకాశాలు అందుతున్నాయా? గ్రామీణ పేదరికం, నిరుద్యోగం, భూమి సమస్యలు, విద్యా-వైద్య రంగాల్లో అసమానతలు, మహిళలపై వివక్ష, కుల ఆధారిత ఆధిపత్యం పూర్తిగా అంతరించిపోయాయా? అనే ప్రశ్నలు ఇంకా మన ముందే ఉన్నాయి. అందువల్ల ప్రజా గానం కూడా తన బాధ్యతను కోల్పోలేదు.విమలక్క పాటలోని బలం ఇక్కడే ఉంది. అది కేవలం గతాన్ని గుర్తు చేయదు.. వర్తమానాన్ని ప్రశ్నిస్తుంది. కేవలం బాధను వ్యక్తం చేయదు.. పోరాటానికి పిలుపునిస్తుంది. కేవలం కన్నీటిని చూపించదు.. ముందడుగు వేయడానికి ధైర్యం ఇస్తుంది. ఒక మంచి ప్రజా గాయకుడి గొంతు ప్రజల బాధను తన బాధగా స్వీకరించాలి. ప్రజల ఆశను తన ఆశగా మలచుకోవాలి. విమలక్కగానప్రస్థానంఅలాంటి బాధ్యతాయుతమైన ప్రజా సాంస్కృతిక ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది. సమానత్వ సాధన దాకా సజీవంగా ఉంటుంది.ప్రజా ఉద్యమాల్లో కళాకారుడి పాత్రను మన సమాజం తరచుగా తక్కువగా అంచనా వేస్తుంది.కానీ చరిత్రచెబుతున్నది వేరే విషయం. ఒక కవిత వేల మందిని కదిలించగలదు. ఒక పాట ఒక గ్రామాన్ని మేల్కొలపగలదు. ఒక గళం భయంతో మూగబోయిన సమాజానికి ధైర్యం ఇవ్వగలదు. అందుకే సాంస్కృతిక పోరాటం కూడా సామాజిక మార్పులో అంతర్భాగమే. ఈ దృక్పథంలో విమలక్క ప్రస్థానం ఒక గాయని ప్రస్థానం మాత్రమే కాదు.. ప్రజా సాంస్కృతిక ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన ప్రజా ఉద్యమ అధ్యాయం.బహుజనుల జీవితం నుంచి పుట్టిన కళను బహుజనుల విముక్తి కోసం వినియోగించడమే ఆమె ప్రత్యేకత. తరతరాలుగా ఆధిపత్య సంస్కృతులు తమ కథలను గొప్పగా చెప్పుకున్నప్పుడు, అట్టడుగు వర్గాల జీవితాలు, వారి శ్రమ, వారి కళ, వారి చరిత్ర పక్కకు నెట్టబడినప్పుడు ప్రజా పాట ఒక ప్రత్యామ్నాయ చరిత్రను నిర్మిస్తుంది. ఆ చరిత్రలో కూలీ చేతి చెమటకు విలువ ఉంటుంది. రైతు కష్టానికి గౌరవం ఉంటుంది. మహిళ స్వరానికి స్థానం ఉం టుంది. బహుజనుల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఉంటుంది. అందుకే విమలక్కను 'బహుజన గాన కోకిల'గా అభివర్ణించడం ఒక అభిమాన సంబోధన మాత్రమే కాదు.. ఆమె గాన దిశను ప్రతిబింబించే మాట.ఐదు దశాబ్దాల ప్రయాణం అంటే సాధారణ కాలవ్యవధి కాదు. ఒక మనిషి జీవితంలో యాభై సంవత్సరాలు అంటే అనేక తరాల మార్పును కళ్లారా చూడటం. ఉద్యమాల ఉధృతి , నిర్బంధాలు, ఆశలు, నిరాశలు, విజయాలు, వైఫల్యాలు అన్నింటినీ దాటి నిలబడటం. ముఖ్యంగా ప్రజల పక్షాన నిలబడిన కళాకారుడికి ఈ ప్రయాణం మరింత కఠినమైనది. ఎందుకంటే ప్రజల పక్షాన ఉండటం అంటే అధికారానికి అనుకూలంగా ఉండటం కాదు. ప్రశ్నించాల్సినప్పుడు ప్రశ్నించడం. అన్యాయం కనిపించినప్పుడు గొంతెత్తడం. ప్రజల బాధ వినిపించనప్పుడు దాన్ని పాటగా మార్చడం.అందుకే విమలక్క గళం తరతరాలకు స్ఫూర్తి. ఆమె పాట ప్రజా పోరాటాలకు ఊపిరి. ఆమె ప్రస్థానం ఉద్యమ చరిత్రకు ఒక చిరునామా. ఒక తరం ఆమె పాటలు విని ఉద్యమాల్లోకి వచ్చి ఉండవచ్చు. మరో తరం ఆమె గానాన్ని విని తమ హక్కుల గురించి ఆలోచించి ఉండవచ్చు. ఇంకో తరం ఆమె ప్రస్థానాన్ని చూసి కళను ప్రజల కోసం ఎలా ఉపయోగించాలో నేర్చుకోవచ్చు. ఇదే ఒక కళాకారుడి అసలైన వారసత్వం.ఇప్పటి తరానికి విమలక్క ప్రస్థానం మరో ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. సోషల్ మీడియా యుగంలో పాటలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. కానీ వైరల్ కావడం, చరిత్రలో నిలవడం రెండూ ఒకటి కాదు. ఒక పాటకు ప్రజల జీవితాలతో సంబంధం ఉండాలి. ఒక గళానికి ప్రజల బాధతో అనుబంధం ఉండాలి. ఒక కళాకారుడి ప్రయాణానికి విలువలు ఉండాలి. అప్పుడే ఆ పాట కాలాన్ని దాటి నిలుస్తుంది. విమలక్క గాన ప్రస్థానం అలాంటి విలువలతో కూడిన ప్రజా కళకు ఒక ఉదాహరణ.ఈ సందర్భంగా ఆమెను అభినందించడం అంటే కేవలం '50వ ప్రస్థాన శుభాకాంక్షలు' చెప్పడం కాదు. ప్రజల కోసం పాడిన ప్రతి పాటకు, అణచివేతను ప్రశ్నించిన ప్రతి స్వరానికి, సమానత్వం కోసం వేసిన ప్రతి అడుగుకు సెల్యూట్ చేయడం. తండ్రి బండ్రు నర్సింలు అందించిన పోరాట స్ఫూర్తిని గుండెల్లో దాచుకుని, అమర్ అన్న పాటల వారసత్వాన్ని కొనసాగిస్తూ, తన గళాన్ని ప్రజల గుండెల్లోకి చేర్చిన విమలక్కకు ఈ ఘనత నిజంగా ఒక ప్రజా అభినందన.ప్రజా ఉద్యమాలు ఎప్పటికీ ఒక వ్యక్తితో మొదలై ఒక వ్యక్తితో ముగియవు. అవి తరతరాలకు సంక్రమించే చైతన్య ప్రవాహాలు. అదే విధంగా ప్రజా పాట కూడా ఒక గొంతుతో మొదలై వేల గొంతుల్లో కొనసాగుతుంది. విమలక్క గళం కూడా అలా కొనసాగాలి. ఆమె పాట కొత్త తరాలకు చేరాలి. ఆమె పోరాట స్ఫూర్తి యువతలో చైతన్యాన్ని నింపాలి. బహుజనుల ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆమె గానం మరింత బలంగా వినిపించాలి.ఆమె నడిపించిన అరుణోదయకు బలం ఇవ్వాలి, నేల తల్లి విముక్తి కోసం పుట్టిన పాట మరింత దూరం వినిపించాలి. ప్రజల కోసం వినిపించిన గళం మరింత బలంగా మారాలి. విముక్తి కోసం పడిన అడుగు మరిన్ని అడుగులకు దారి చూపాలి. బహుజనుల కోసం సాగిన పోరాటం మరి న్ని తరాలకు స్ఫూర్తి కావాలి. ఇదే విమలక్క కు మనసారా అందించగల హృదయపూర్వక శుభాకాంక్ష.మా బహుజన గాన కోకిల విమలక్కకు హృదయపూర్వక 50వ ప్రస్థాన శుభాకాంక్షలు. మీ గళం తరతరాలకు స్ఫూర్తిగా నిలవాలి. మీ పాట ప్రజా పోరాటాలకు ఊపిరిగా కొనసాగాలి. మీ అడుగులు సామాజిక న్యాయం వైపు మరిన్ని తరాలను నడిపించాలి. మీ ప్రస్థానం ప్రజా ఉద్యమాల చరిత్రలో చిరస్థాయిగా నిలవాలి. మీరు సెప్టెంబర్ 26 ఉదయం నుంచి 28 మధ్యాహ్నం వరకు ఏకధాటిగా సాగిస్తున్న 50 గంటల ప్రజా కళా జాతర విజయవంతం కావాలని ఆశిస్తూ..



**మన్నారం నాగరాజు**

# సామాజిక విప్లవ యోధుడు పాపన్న

16 వ శతాబ్దంలో భూస్వామ్య వ్యవస్థలను సవాలు చేసి ప్రజాస్వామ్య సౌరభాలను వెదజల్లిన ధిక్కార కాలమది.1650 నుంచి 1710 మధ్య తెలంగాణలో ఒక వీరుని చరిత్ర కొనసాగింది. కాని జనం గుండెల్లో వీరులుగా శాశ్వతంగా పేరు సంపాదించుకున్న వారి విషయంలో కూడా అక్షరాలు వివక్షతను చూపించాయి. పాపన్న నిర్మించిన కోటలు ఇప్పటికీ నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి. కోటలపై ఎగిరేసినజెండాలు ఆయనచరిత్రను చెబుతున్నాయి. ఆయన కట్టించిన స్తూపాలు శిలాఫలకాలు ఇంకా చెక్కుచెదరలేదు.పాపన్న గురించి అనేకమంది భిన్న రకాలుగా ప్రస్తావించారు .మొఘల్ చరిత్రకారులు పాపన్నను బందిపోటు అని రాసుకున్నారు. బ్రిటిష్ వారు పాపడు సామాజిక బందిపోటు అన్నారు. కానీ ప్రజల నాలుకల మీద మాత్రం వీరుడిగా, ఓరుగల్లు కోటను కొట్టిన యోధుడిగా, గోల్కొండ దాకా రాజ్యాన్ని విస్తరించిన రాజుగా నిలిచిపోయాడు పాపన్న.ఆయన చరిత్ర పుస్తకాలలో కన్నా జానపద కలలోనే ప్రస్ఫుటంగా వ్యక్తం అయింది .వారే ఆ వీరుడి కథను వారసత్వంగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటికీ శారద కథల వాళ్ళు, బుడిగ జంగాల వాళ్ళు, జానపదులు వాళ్లు పాపన్న కథలను పాడుతున్నారు.పాపన్న పోరాట స్ఫూర్తిని బతికిస్తున్నారు.18 వ శతాబ్దంలో జేఏ బోయల్, పాపన్న చనిపోయిన రెండు శతాబ్దాల తర్వాత ప్రజల నాలుకల మీద నుండి వేరు చేసి పాపన్న చరిత్రను వెలికి తీశాడు.ఆయన తరువాత రిచర్డ్ ఈటెన్ దక్షిణాది సామాజిక విప్లవ యోధుడి చరిత్రను ఆధారాలతో సహా ప్రపంచం ముందుకు తీసుకొచ్చాడు.తర్వాత మల్లంపల్లి సోమశేఖర్ శర్మ, ఆదిరాజు వీరభద్రరావు, హరి ఆదిశేషులు, బి.ఎన్ శాస్త్రి, పేరువారం జగన్నాథం, బిరుదు రామరాజు, ఏటుకూరి బలరామమూర్తి, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు,కొంపెల్లి వెంకట్ గౌడ్ తో ఆహా అనేకమంది పాపన్న చరిత్రపై అధ్యయనం చేసి ప్రజలకు చేరువ చేశారు.పాపన్న పుట్టే కాలానికి తెలంగాణ మొగల్ పరిపాలన ఆధీనంలో ఉండే.ఆ కాలంలో కరువు కాటకాలు,వరదలు మసూచి వంటి అంటు వ్యాధులు, ప్రజల బతుకులను అతలాకుతలం చేసినవి. అట్టి కష్టకాలంలో ప్రజలను ఆదుకోవాల్సింది పోయి జమిందారులు పన్నులు, అధిక వడ్డీలు వసూలు చేసినారు.16వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్యాన్ని అధిష్టించిన ఔరంగాజేబు సరిహద్దులను చెడుపుకుంటూ వెళ్లే ప్రయత్నం చేశాడు. ఔరంగజేబు కాలంలో ప్రాంతీయ ఉద్యమాలు,స్వాతంత్ర్య ఉద్యమాలు బలంగా పెరుగుతూ వచ్చాయి. ఉత్తర పశ్చిమ సరిహద్దులలో ఆఫ్ఘానులు, ఉత్తర భారతంలో జాట్లు, రాజ్ పూట్ లు, పంజాబ్ లో సిక్కులు, దక్కన్ ప్రాంతంలో మరాఠాల నుంచి తీవ్రమైన సమస్యలు ఎదురయ్యాయి. ఒకపక్క ప్రత్యక్ష యుద్ధం, మరోపక్క గేరిల్లా యుద్ధంతో గిరిజన నాగజాతి ఆహోమ్ లు మొగల్ సైన్యాన్ని దెబ్బ కొట్టాయి. ఇంకో దిక్కు చత్రపతి శివాజీ నేతత్వంలో మరాఠీలు మొగల్ సామ్రాజ్యాన్ని దక్షిణాదిలో నిలకడగా ఉండనివ్వలేదు.అదే కాలంలో తెలంగాణలో మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు మొదలయ్యింది. 1687లో కుతుబ్షాహీలు ఓడిపోయిన తర్వాత తెలంగాణతో పాటు దక్కన్ అంతా కూడా మొగల్ అధికారంలోకి వచ్చింది. మళ్లీ తిరిగి అసఫ్ జాహీలు 1724లో అధికారంలోకి వచ్చేంతవరకు మొగల్ పరిపాలన కొనసాగింది. అయితే మొగల్ లులు ఢిల్లీ నుండి ఇంత సుదూరంగా కొనసాగినందువల్ల వాళ్ల పరిపాలన సజావుగా కొనసాగకపోవడం వల్ల మొగల్ అధికారులు దౌర్జన్యాలు అధికంగా చేయడం వలన అటు మరాఠాలోనూ ఇటు తెలంగాణలోనూ అనేక తిరుగుబాట్లు జరిగినాయి.సరిగ్గా అదే సమయంలోఢిల్లీ హైదరాబాదుకు మధ్య జరిగే రవాణాకు గండి కొట్టి అటు ఢిల్లీ దర్బారు, ఇటుతెలంగాణ జమీందారుల గుండెల్లో వణుకు పుట్టించిన యోధుడు ఆవిర్భవించాడు ఆయనే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. బానిసత్వం ఉన్నచోట తిరుగుబాటు కచ్చితంగా ఉంటుందనీ అలాంటి బానిసత్వానికి వ్యతిరేకంగా మొట్టమొదటగాజెండాబాతీనది సర్వాయి పాపన్న.పాపన్న వరంగల్ జిల్లా కిలాసాపూర్ తాటికొండ గ్రామంలో 1650 వ సంవత్సరంలో ఆగస్టు 18న జన్మించాడు. పాపన్న చిన్నతనంలోనే తండ్రి మరణించగా, తల్లి సర్వమ్మ అన్ని తానై పాపన్నను పెంచింది.జమీందారుల అరాచకాలను కుల వివక్షను, కొన్ని కులాలే పాలించే సంస్కృతి పట్ల చిన్నతనంలోనే పాపన్నకు ఆలోచన మొదలైంది. తెలంగాణలో ఎక్కువగా స్థానిక జమీందారుల రాచరికమే నడుస్తుంది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వెట్టి చాకిరి చేయించుకున్నది ఇక్కడ జమీందారులే. ఆ బానిసత్వం నుండే ఒక తిరుగుబాటు ఆలోచన మొదలైంది. తిరుగుబాటు వద్దని తల్లి అనేకసార్లు పాపన్నకు మిక్కి చెప్పింది. కానీ తాళ్లు ఎక్కితే ఏం వస్తది,కళ్ళు గీస్తే ఏమొస్తది మనం రాజ్యమేలాలి,రాజులం కావాలి,మన చేతులు గోల్కొండ కోట మీద పడాలి,గప్పుడే మన బతుకులు బాగుపడతాయనీ ఆ ఆలోచనతో ముందుకు సాగి రాజ్య స్థాపన కోసం డబ్బు అవసరమని పాపన్న గుర్తించాడు. దీనికోసం పాపన్న ఒక కొత్త పందాను ఎంచుకున్నాడు. ముందుగా దారిదోపిడీలకు




పథకం వేశాడు.1690లో తాటికొండలో ఒక చిన్న మట్టి కోటను నిర్మించుకున్నాడు. తర్వాత సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని రాజ్యసంపదకు గండి కొడుతూ వచ్చాడు. ఆ సమయంలో పాపన్నను బంధీ కాణాలో బంధించారు. బయటకు వచ్చిన తర్వాత అందరం కలిసికట్టుగా పోరాడుదాం,అప్పుడు దొర కాదు కదా.! ఎవరు మనలను ఏమి చేయలేరని ప్రజలకు సైన్యానికి దిశా నిర్దేశం చేశాడు. ఊరి జనాలందరినీ ఏకం చేసి రాజ్యం ఒక్కరి సొత్తు కానే కాదని స్పష్టం చేశాడు.పరాయి పాలనలో బానిసలుగా బతకడం కంటే ధిక్కరించి స్వయంపాలన చేసుకుందామని పాపన్న నినదించాడు. సామాజిక వ్యవస్థ గురించి ఒక స్పష్టమైన ఆలోచనతో ఒక సిద్ధాంతంతో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు.రాజ్యం ఎవరి సొత్తు కాదని ప్రజల భాషలో వివరించాడు. స్నేహితులైన చాకలి సర్వన్న,కుమ్మరి గోవిందు,జక్కుల పెరుమాళ్ళు,మంగలి మాసన్న,దూదేకుల పీర్ మహమ్మద్, కొత్వాల్ మీర్ సాహెబ్ ల తో కులమత వర్గభేదం లేని సైన్యాన్ని తయారు చేయాలనుకున్నాడు. ఇప్పటివరకు మనం బతికిన బానిస బతుకులు చాలు తిరుగుబాటు చేద్దాం.. రాజులమవుదాం. రాజ్యం అనేది ఏ కులపోని సొత్తు కాదు అందరం కలిసి పోరాడుదాం రండి అంటూ సర్వాయిపేటలో మొదటి రాతి కోటను నిర్మించుకున్నాడు. ఆ తర్వాత తాటికొండ గుట్టమీద శత్రు దుర్భేద్యమైన కోటను కట్టుకున్నాడు. తర్వాత ఖిలాషిపూర్ లో ఎత్తైన కోటను నిర్మించుకున్నాడు.కిలాసాపూర్ కేంద్రంగా పాపన్న తన పరిపాలన కొనసాగించినట్లు చరిత్రకారులు చెబుతారు. ఓరుగల్లు నుండి గోల్కొండ వరకు రాజ్యాన్ని విస్తరించాలని ఉద్దేశంతోనే కిలాసాపూర్ని పరిపాలనా కేంద్రంగా ఎంచుకున్నాడు.పాపన్న నిర్మించిన కోటలు ఆనాటి రాజుల కోటలకు, జమీందారుల కోటలకు భిన్నంగా కనిపిస్తాయి. పాపన్న నిర్మించిన అన్ని కోటలలోను విలాసవంతమైన కోటలు ఎక్కడా కూడా ఉండవు.రక్షణ ప్రదేశాలు మాత్రమే ఉంటాయి తప్ప, విలాసాలకు అవకాశం లేదు.భూస్వామ్య అగ్రకులాల పెత్తందారి విధానాన్ని ఎదుర్కోవడానికి దళితులను వెనుకబడిన వర్గాలను ముస్లింలను గిరిజనులను కూడగట్టి వారిని సైనికులుగా తీర్చిదిద్దాడు. తమ చేతుల్లో ఉండే సామాగ్రిని ఆయుధాలుగా మార్చి వారికి శిక్షణ ఇప్పించాడు. ఆశిక్షణా శిబిరంలోని వందలాదిమంది సైనికులను తయారు చేసుకున్నాడు. కింది కులాల వారిని చైతన్యం చేయడంతో పాటు వారు ఎదగడానికి అవకాశాలు కల్పించాడు.అణచివేతలకు ఎదురు తిరిగేలా ధైర్యాన్ని ఇచ్చాడు. అందుకే రాజ్యం దృష్టిలో బందిపోటుగా ముద్రపడ్డ కూడా జనంలో మాత్రం తిరుగులేని నాయకుడుగా పేరు తెచ్చుకున్నాడు. కల్లు మండువా దగ్గర మొదలైన పాపన్న కథ రోజు రోజుకు మలుపులు తిరుగుతూ వచ్చింది.పాపన్న ప్రతి సందర్భాన్ని వినియోగించుకున్నాడు. పాపన్న వ్యూహం పండితే తిరుగు ఉండదు.ఆయన చాలా ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. వరంగల్ భువనగిరి కోటలపై కూడా ఆయన జెండా ఎగరవేశాడు. 1707లో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు చనిపోవడంతో సామ్రాజ్యం గందరగోళంలో పడింది. అప్పటికి హైదరాబాదు కూడా అస్తవ్యస్తంగా మారింది. సమయం కోసం ఎదురుచూస్తున్న పాపన్నకు మంచి అవకాశం దొరికింది.మొగల్ సైన్యం దృష్టి మరలచి వరంగల్కోట మీద నగరం మీద రెండు రోజుల పాటు చేసిన ఈ దాడితో పాపన్న ఒక్కసారిగా దేశాన్ని ఆకర్షించాడు.ఆ తర్వాత సైన్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మచిలీపట్నం వెళ్లి బ్రిటిష్ వారి దగ్గర ఆయుధాలను కొనుగోలు చేశాడు. సైన్యాన్ని పెంచుకోవడంతో పాటు విదేశీ యుద్ధ సామాగ్రిని సమకూర్చుకున్నాడు. దీనితో వరంగల్,కరీంనగర్ , భువనగిరి కోటలపై పాపన్న జెండా ఎగరవేశాడుసర్వాయి పాపన్న విజయాలు మొగల్ చక్రవర్తులను సైతం వనికించాయి. సొంత రాజ్యాన్ని నిర్మించుకున్న పాపన్నను చూసి మొగల్ చక్రవర్తి బహుదూర్ షా ఆశ్చర్యపోయి ఎవరు ఊహించనివిధంగా స్నేహ హస్తం అందించారు. చట్టబద్ధంగా కప్పం చెల్లించి రాజ్యపాలన చేసుకోవచ్చన్నాడు.గోల్కొండ రాజ్యం కోసం బహుదూర్ షాకు పాపన్న 14 లక్షల రూపాయలు కప్పం చెల్లించారని చెబుతారు. పాపన్నకు గోల్కొండ కోటలో బహుదూర్ షా ఇచ్చిన ఆదిత్యానికి దేశం నివ్వరపోయింది. తెలంగాణలో జమీందారులు అంతా గజా గజా వనికిపోయారు. ఒక కింది కులం వ్యక్తి కింద జమీందారులుగా ఉండాల్సి వస్తుందని రగిలిపోయారు.అప్పటికే పాపన్న దాడికి గురైన ఎంతోమంది ఇక పాపన్నకు మొగల్ సామ్రాజ్యం అండ దొరికితే బతకలేమనిఅనుకున్నారు. ఏదైనా దీన్ని చెడగొట్టాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాదు రాజ్యంలోని ప్రముఖులంతా కలిసి పాపన్న కింద పనిచేయలేమనిమొగల్ చక్రవర్తికి సంకేతం పంపించారు. పాపన్న బందిపోటు మాత్రమేనని మొగల్ సంపదను దోచుకున్నాడని బహుదూర్ షా కు నూరిపోశారు. పాపన్న మీద యుద్ధానికి రెచ్చగొట్టారు. దానితో బహుదూర్ షా పాపన్న పై యుద్ధం ప్రకటించాడు.1709 లో తాటకొండలో మొగల్ సైన్యానికి పాపన్న సైన్యానికి మధ్య యుద్ధం జరిగింది.అది కొన్ని నెలల పాటు కొనసాగింది. చివరికి పాపన్న సైన్యం ఓడిపోయింది. పరిస్థితులు అనుకూలంగా లేవని తెలిసి పాపన్న రహస్య ప్రాంతాలకు వెళ్లిపోయాడు. కరీంనగర్ లోని హుస్నాబాద్ లో మారువేషంలో ఉన్న పాపన్న సమాచారాన్ని ఢిల్లీకి అందించాడు. మొగల్ సైన్యాలు చుట్టుముట్టి పాపన్నను కిరాతకంగా చంపివేశాయి. గోల్కొండ కోటకు ఆయన మొండాన్ని వేలాడదీశారు. రాజ్యం మీద తిరుగుబాటు చేసిన వారికి దేశం మీద దండయాత్ర చేసిన వారికి దేశ చరిత్రలో స్థానం దక్కింది కానీ ఆధిపత్య సంస్కృతిని ఎదిరించిన వారికి మనుస్మృతి ను ధిక్కరించి, బహుజన రాజ్యం కోసం పోరాడిన వారికి స్థానం దక్కదు. అదే మన చరిత్ర.చత్రపతి శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న ఇద్దరు కూడా సమకాలీకులు కానీ శివాజీకి చరిత్రలో దక్కిన స్థానం సర్వాయి పాపన్న కు దక్క లేదు.కారణం పాపన్నకుల వ్యవస్థను తీవ్రంగా ధిక్కరించాడు. పాపన్న పోరాటం చేసింది రాజ్యం మీద కాదు రాజ్య స్వభావం మీద, ఆధిపత్య సంస్కృతి మీద, భూస్వామ్య సంస్కృతి మీద.అయితే ఇక్కడ స్థానికంగా స్థిరపడిన జమీందారులు మొగల్ పాలకులకు తప్పుడు సమాచారాన్ని ఇస్తూ వచ్చారు. కింద కులం నుంచి వచ్చిన పాపన్న ఎదుగుదలను చీర్నించుకోలేకపోయారు. తెలంగాణ ఆదిమ సంస్కృతికి పాపన్న పట్టం కట్టాడు.పాపన్న బౌద్ధ సంస్కృతికి పట్టం కట్టాడు.బౌద్ధ రాజ్యం అంటే రాజ్యసంపదలో అందరికీ వాటా ఉండడమే.బహుజన రాజ్యం అంటే పరిపాలనలో అందరికీ సమాన హక్కులు కల్పించడమే.అప్పటికే ఉన్న గుడులను కూడా దళిత బహుజనులకు అప్పగించాడు. ఈ సాంప్రదాయాలను పాపన్న మొదటి నుంచి పాటిస్తూ వచ్చాడు.గ్రామదేవతల సంస్కృతిని తిరిగి బ్రతికించాడు.ప్రజల నాలుకల మీద 400 ఏండ్ల నుండి పాపన్న ఇప్పటికి బ్రతికే ఉన్నాడు ఎప్పటికీ బతికే ఉంటాడు. ఆ వీరుని పోరాట స్ఫూర్తి నిరంతరం దళిత బహుజన వర్గాల గుండెల్లో రగులుతూనే ఉంటుంది.

**పందుల సైదులు**
**న్యాయవాది,**
**తెలంగాణ విద్యావంతుల వేదిక**
**9441661192**



## సర్పంచ్‌ల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఏనుగు నరేందర్‌రెడ్డి

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** సర్పంచ్‌ల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ సర్పంచ్ ఏనుగు నరేందర్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సర్వీ యాదయ్యగౌడ్ సమక్షంలో నరేందర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. జిల్లా, మండల స్థాయిలో సమగ్ర అభివృద్ధితో పాటు గ్రామాల పురోభివృద్ధి, ప్రజల సంక్షేమం, మెరుగైన పరిపాలనకు సమిష్టిగా కృషి చేయాలనే ఉద్దేశంతో నరేందర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఫోరం రాష్ట్ర సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. అందరి సహకారంతో జిల్లాలోని మండలాలు, గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి ఫోరం తరఫున నిరంతరం కృషి చేస్తానన్నారు.తన ఎన్నికకు సహకరించిన బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటీ), జిల్లా, మండల బీఆర్ఎస్ సర్పంచ్‌లు, మండల, జిల్లా నాయకులకు నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నరేందర్‌రెడ్డి ఎన్నిక పట్ల గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## నాగుల పంచమి వేడుకలు



**విశ్వంభర, కమాన్ పూర్:** కమాన్ పూర్ మండలంలో సోమవారం నాగుల పంచమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి దేవస్థానం ఆవరణలో గల నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అక్కడే ఉన్న పుట్టలో పాలు పోశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో గల నాగదేవతలకు పూజలు చేసి పుట్టలో పలు పోశారు. ఈ సందర్భంగా తమ కష్టాలు, ఎవరోదాలు, ఆటంకాలు తొలిగిపోవాలని, సుఖ సంతోషాలు ప్రాప్తించాలని నాగదేవతను వేడుకున్నారు.

## నర్సాయిగూడెంలో ఎల్ నినో పై రైతులకు అవగాహన



**విశ్వంభర, వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని నర్సాయిగూడెం గ్రామం లో రైతులకు ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఏ ఈ ఓ రమేష్, మాట్లాడుతూ రైతులు ఒక ఎకరా వరి పండించే నీటితో మూడు నాలుగు ఎకరాలు ఆరుతడి పంటలు పండించవచ్చునని తెలియజేశారు. వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, ఆముదం పంటలతో పాటు కూరగాయల సాగు కూడా చేపట్టాలని తెలియజేశారు. అదేవిధంగా నీటి వనరులు అందుబాటులో ఉన్న దగ్గర వరికి బదులుగా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఒక ఎకరా వరి పంటకు కావాల్సిన నీటితో రెండు ఎకరాల వరకు ఆయిల్ ఫామ్ పంట సాగు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసల జ్యోతి, పసల ఎన్నయ్య, బాలశౌరి, భాస్కర్, వేర్పుల అబ్బయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు ఉద్యమిస్తాం : రాగల్ల ఉపేందర్ మాదిగ

**విశ్వంభర, మహేశ్వరం :** పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదల కోసం కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్ రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు, మహేశ్వరం మండల కేంద్రంలోని జేమ్లా నాయక్ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ సమావేశం ఎర్ర గణేష్ మాదిగ అధ్యక్షతన జరిగింది, ముఖ్య అతిథిగా హాజరైన ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగా అణగారిన వర్గాలు వెనుకబడ్డాయని అన్నారు, కుల వివక్ష, దోపిడీ, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు, పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షీరామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, మాదిగలతో పాటు పేదరికంలో ఉన్న అన్ని వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ఉద్యమించాలని కోరారు. వివిధ సామాజిక శక్తులను కలుపుకొని ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు, అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఇతర అనుబంధ విభాగాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు, చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు,సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో రావుగళ్ల బాబు మాదిగ, డా. జంగన్న మాదిగ, ఆదిరాల భరత్ మాదిగ, శేఖర్ మాదిగ, స్వామి మాదిగ, కుమార్ మాదిగ, కిన్నెర రాజు, ఏలేటి వెంకటేష్, గోల్లూరి మల్లేష్, నరేష్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## వాతావరణ మార్పులతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు



**విశ్వంభర, హైదరాబాదు :** హైదరాబాద్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు, మరోవైపు ఉక్కపోత, పగలు-రాత్రి ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులతో నగరంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి ఓపీ విభాగం ప్రస్తుతం రోగులతో కిటకిటలాడుతోంది. సాధారణ రోజుల్లో రోజుకు 150 నుంచి 200 మంది వరకు వైద్య సేవలు పొందేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 300 నుంచి 500కు చేరుకున్నట్లు ఆసుపత్రి వర్గాలు గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంతో పోలిస్తే సీజనల్ వ్యాధులతో వచ్చే రోగుల సంఖ్య దాదాపు 30 శాతం పెరిగినట్లు వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం జ్వరం, వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, గొంతు నొప్పి, బలహీనత, శక్తిహీనత వంటి లక్షణాలతో ఎక్కువ మంది ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కొందరిలో వాంతులు, విరేచనాలు కూడా కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం కావడం, వర్షాకాలం కొనసాగడం కూడా వైరల్ ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తికి కారణమవుతున్నట్లు చెబుతున్నారు. వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమల సంఖ్య పెరిగిందని, దీంతో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు కూడా పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల డయాగ్నస్టిక్ కేంద్రాల్లో రక్త పరీక్షల సంఖ్య కూడా పెరిగినట్లు తెలుస్తోంది. జ్వరం వచ్చిన వెంటనే ప్రజలు రక్త పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతుండటంతో ప్రయోగశాలల్లో రద్దీ నెలకొంది. మరోవైపు జ్వరం, జలుబు, దగ్గు మందుల విక్రయాలు పెరిగినట్లు ఫార్మసీ నిర్వాహకులు చెబుతున్నారు. సాధారణ జ్వరంగా భావించి నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు. రెండు రోజులకుపైగా జ్వరం కొనసాగినా, తీవ్రమైన బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు వంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. వాతావరణంలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మరిగించిన నీటిని తాగాలని, బయట ఆహారానికి దూరంగా ఉండాలని, వైద్యుల సలహా లేకుండా మందులు వాడకూడదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యం లో సీజనల్ వ్యాధులను నియంత్రించేం దుకు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్రభుత్వ యంత్రాంగం కూడా పారిశుద్ధ్య చర్యలను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి : మంద సంజీవరెడ్డి డిమాండ్



**విశ్వంభర, మేడిపల్లి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద బిఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ పీర్జాదిగూడ బిఆర్ఎస్ నాయకులు మీడియా తో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పేదింటి ఆడబిడ్డకు పెళ్లి కానుకగా కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ సర్కార్ ఆపివేయాలని పన్నాగం పన్నుతున్నారని,ఆ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ మేడిపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు బోడుప్పల్, పీర్జాదిగూడ బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ పేద ఇంటి ఆడబిడ్డకు ఒక అన్నగా , ఒక మేనమామగా ప్రభుత్వ కానుకగా 1లక్ష 16 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కెసిఆర్ నాయకత్వంలో విజయవంతంగా అమలు చేశామని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను ఎన్నికల్లో1 లక్ష 16 వేల రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని స్పష్టమైన హామీ ఇచ్చికూడా దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తుందని కానీ నేటికీ ఏ ఒక్కరికి తులం బంగారం కూడా ఇవ్వలేదని, కళ్యాణ లక్ష్మి పథకం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తూ ప్రభుత్వం తరపున ఈ పథకంపై ఎలాంటి వాదనలు వినిపించకుండా కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలను, ప్రజలను, మోసం చేస్తుందని, ఇదిలాగే కొనసాగితే త్వరలోనే రేవంత్ రెడ్డి సర్కార్కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, తక్షణమే ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ సర్కార్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని, తమ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలు అమలు చేసి తీరాలని మంద సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా శాంతియుతంగా ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్నమని కావాలనే అధికారులు నీళ్లు పోసి నిరసన తెలుపకుండా అడ్డుకునే యత్నం చేశారని, పోలీసు వాహనాన్ని ధర్నా చేసే చోట అడ్డుగా నిలిపారని, ఇదెక్కడి ప్రభుత్వపు న్యాయమని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి మంద సంజీవరెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ కార్పొరేటర్లు నాయకులు, పీర్జాదిగూడ బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘు వర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కొల్తూరి మహేష్, కౌడి పోచయ్య,సీనియర్ నాయకులు,మహిళలు యూత్ నాయకులు, కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాకు బదులు ఆకుపచ్చ రంగు జెండాతో ర్యాలీ

### బీజేపీ నేతల ఆగ్రహం -కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఎలిమినేటి నరసింహ రెడ్డి



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** తుర్క యంజాల్ , కమ్మగూడలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన అవకతవకలపై జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలలో జాతీయ జెండాకు బదులుగా ఆకుపచ్చ రంగు జెండాను విద్యార్థుల చేత ర్యాలీగా ప్రదర్శించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఈరోజు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి గారికి ఫిర్యాదు అందజేశారు. సంబంధిత పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం అంటే జాతీయ జెండాకు, జాతీయ గీతాలకు ఇచ్చే గౌరవం. అలాంటి పవిత్రమైన రోజున జాతీయ జెండాను పక్కనపెట్టి వేరే జెండాతో ర్యాలీ చేయడం దేశభక్తిని అవమానించడమే. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో బచ్చిగళ్ల రమేష్, కొత్త రాంరెడ్డి, గుండ కృష్ణ, సురేష్ నందగిరి, రమేష్ యాదవ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మశాన వాటికను డంపింగ్ యార్డుగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని దుబ్బాక రోడ్డులో ఉన్న స్మశాన వాటిక, వెంకట్రామయ్య చిన్న చెరువు అలుగు వద్ద పరిసరాలు అన్నిటిని అపరిశుభ్రతకు గురి చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని సోమవారం రోజు జరిగిన మండల స్థాయి ప్రజావాణిలో గ్రామస్తులు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఇక్కడ చెత్త వేయడం మూలంగా పందులకు, కుక్కలకు, కోతులకు ఆవాసాలుగా మారాయని, రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనాలపై దాడి చేస్తూ వాహనదారులను గాయపరుస్తున్న సంఘటనలు కూడా నెలకొన్నాయని, రామన్నపేట పట్టణానికి చెందిన కొందరు పాత ఇనుప సామాను వ్యాపారస్తులు ఇనుప సామాను కొనుగోలు ద్వారా వచ్చిన వ్యర్థాలను, ట్రాక్టర్ యాజమాన్యాలు పాత ఇళ్ళు కూలగొట్టడం ద్వారా వచ్చిన వ్యర్థాలను, యాటలను కోసే వారు, మాంసాన్ని విక్రయించేవారు అందులో వచ్చే తోలు, బొక్కలు ఇతర వ్యర్థాలను, కొందరు వ్యక్తులు తమ ఇండ్లలో వచ్చే చెత్త ఇతర వాటిని ఈ ప్రాంతంలో వేయడం వల్ల ఇది డంపింగ్ యార్డుగా మారిపోయిందని, స్మశాన వాటిక మొత్తం అపరిశుభ్రంగా తయారై దుర్గంధాన్ని వెదజల్లుతూ పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, చెరువు అలుగు పోసే ప్రాంతంలోనే ఇవి వేయడం వల్ల చెరువు నుండి అలుగు పారితే నీరు పోవడానికి ఇబ్బందులు ఏర్పడి చెరువు కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, కావున సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, చెత్తను వేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో పట్టణ ప్రజలు కోరినారు.



## ప్రతి పిటిషన్‌ను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

**విశ్వంభర, కురవి:** ప్రజల నుంచి వచ్చే ప్రతి పిటిషన్‌ను నిర్ణీత సమయంలో పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కురవి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ 2.0, స్టేషన్ రైటర్ విభాగాలతో పాటు జనరల్ డైరీ, వివిధ రికార్డులు, రౌడీ, సస్పెక్ట్ షీట్లు, పాయింట్ బుక్స్‌ను పరిశీలించారు. కేసులు, పిటిషన్లు, స్టేషన్ సమాచారాన్ని సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ నేరాల నియంత్రణ, దర్యాప్తులో ఫుటేజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. కురవి పరిధిలోని బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్ఐ సతీష్‌కు సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి బీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి నేరాలు, అక్రమ కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. 100, 112 కాల్స్, ప్రజావాణి పిటిషన్లపై తీసుకుంటున్న చర్యలను ఎస్పీ సమీక్షించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సిబ్బంది బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ డా. శబరీష్ సూచించారు.

## 23 అర్ధరాత్రి నుంచి ఆటోల బంద్




**విశ్వంభర, ముషీరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి తెలంగాణ వ్యాప్తంగా ఆటో, స్కూల్ వ్యాన్, క్యాబ్‌లను నిరవధికంగా బంద్ చేస్తామని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి తెలిపారు. హైదరాబాదులోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. పెంటయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్లకు ఏటా ప్రకటించిన రూ.12 వేల ఆర్థిక సాయాన్ని బకాయిలతో సహా చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా పర్మిట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఈవీ ఆటోలను ప్రవేశపెట్టే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఓలా, ఊబర్, ర్యాపిడో అక్రమ బైక్ సేవలను అరికట్టాలని కోరారు. ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలను పెంచడంతో పాటు ఈ-చలాన్లపై 80 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు సుంకరి మల్లేశం మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ధర్నా అనంతరం బీఎంఎస్ ప్రతినిధులు ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతల నందకిషోర్, కె. శ్రీధర్ రెడ్డి, సమ్మయ్య, యాదవ్, బాబురాజ్, జేబీఎస్ శ్రీనివాస్, జహంగీర్, శ్రీనివాస్ యాదవ్, అశ్విన్ రాజు, ఈశ్వర్, పరశురాం, వజ్రలింగం, కపిల్, ఆర్. మహేష్, సంతోష్, బుచ్చయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకుల ధర్నా



**విశ్వంభర, ఫలక్ నుమ :** కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఉన్న స్టేను వెంటనే ఎత్తివేసి, అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ చంద్రాయణ గుట్ట బీఆర్ఎస్ పార్టీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రామ్ రెడ్డి, నాయకులు ఆధ్వర్యంలో బండ్లగూడ ఎం ఆర్ ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే కొనసాగడం వల్ల అనేక మంది అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్టేను ఎత్తివేసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచే ఈ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగించాలని నాయకులు కోరారు. సమస్యను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ చీ నాగరాజుకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## తెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా గర్ధాస్ విక్రమ్

**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసి రాష్ట్ర కార్యదర్శిగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్, రైతుబిడ్డ గర్ధాస్ విక్రమ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గర్ధాస్ విక్రమ్ కు ఇంద్రపాలనగరం గ్రామ ప్రజలు, నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తమ అభినందనలు, హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.





## గంథాలయాన్ని ప్రభుత్వపరం చేయాలి

**విశ్వంభర, సూర్యాపేట:** నాగారం బంగ్లా వద్ద స్థానికుల సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని మండల కేంద్రంలో ప్రభుత్వపరంగా నిర్వహించాలని గ్రంథాలయ కమిటీ సభ్యులు కోరారు. గ్రంథాలయ నిర్వహణకు ప్రభుత్వం ఒక వాలంటీర్‌ను నియమించాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు. 2024లో ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు గ్రంథాలయం ఏర్పాటు కోసం దరఖాస్తు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి సొంత ఖర్చులతో ప్రతిరోజూ పత్రికలు, పుస్తకాలు సమకూర్చుతూ గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. పాఠకులకు పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచి వారి పేర్లను నమోదు చేసుకుని తిరిగి వాటిని జమ చేసుకుంటున్నామని తెలిపారు. గ్రంథాలయానికి ఒక వాలంటీర్‌ను నియమిస్తే పుస్తకాలు, పత్రికలను పాఠకులకు క్రమబద్ధంగా అందజేయడంతో పాటు తిరిగి వాటిని సేకరించేందుకు వీలుంటుందని చెప్పారు. ప్రస్తుతం ప్రతిరోజూ పత్రికలు, ఇతర నిర్వహణ ఖర్చులను సొంతంగా భరించడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. మండల ప్రజల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని ప్రభుత్వపరంగా నిర్వహించి, అవసరమైన సిబ్బందిని నియమించాలని ఎంపీడీవోను కోరారు. ఈ మేరకు గుంటకండ్ల ముకుందారెడ్డి, పాశం అనుగ్రహరెడ్డి, బంధారపు వెంకటయ్య తదితర కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**విశ్వంభర, పరిగి:** మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద పరిగి పట్టణానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పరిగి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు,మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజపుల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే అండగా ఉండి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆరిఫ్, కాంగ్రెస్ నాయకులు సాగర్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పి నరసింహా



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఎస్ జి ఎఫ్ ఐ మహబూబాబాద్ జోన్ కార్యదర్శిగా మహంకాళి వెంకటేశ్వర్లు ఎంపిక



**విశ్వంభర, మహ బూబాబాద్ :** మహబూబాబాద్ పట్టణంలో లయన్స్ క్లబ్ భవనం నందు జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో మహబూబాబాద్ జోన్ పరిధిలోగల మహ బూబాబాద్, గార్ల, బయ్యారం మండలాలకు సంబంధించిన అన్ని యాజమాన్యాల వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో జెడ్ పి హెచ్ ఎస్ కంబాలపల్లి వ్యాయామ ఉపాధ్యాయులు మహంకాళి వెంకటేశ్వర్లను 2026- 27 విద్యా సంవత్సరం నకు గాను మహబూబాబాద్ జోనల్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జోన్లోగల అన్ని యాజమాన్యాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉప్పుగడ్డ తండా సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం ఉప్పుగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 461లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే మరో ప్రాంతానికి తరలించాలని ఉప్పుగడ్డ తండా గ్రామస్తులు డిమాండ్ చేశారు. తండాకు కనీసం అర కిలోమీటర్ దూరం కూడా లేకుండానే డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడం వల్ల చెత్త, దుర్వాసన, కాలుష్యంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ముందే స్థల పరిస్థితులను పూర్తిగా పరిశీలించాల్సి ఉన్నప్పటికీ, తండాకు ఇంత సమీపంలో యార్డ్‌ను ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ సమస్యపై గతంలోనే ఎమ్మార్వో, ఆర్డీవోలకు గ్రామస్తులంతా కలిసి లేఖలు అందజేసినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్యను పరిష్కరించకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయం తెలిసిన వెంటనే స్థానిక సర్పంచ్ నవీన్ దృష్టికి కూడా తీసుకెళ్లామని గ్రామస్తులు తెలిపారు. తండా వాసుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ ఇక్కడే డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. డంపింగ్ యార్డ్‌ను తరలించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తండాకు సమీపంలో డంపింగ్ యార్డ్‌ను కొనసాగించనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగడ్డ సర్పంచ్ నేనావత్ రాజు నాయక్, ఉపసర్పంచ్ మోహన్ నాయక్, వార్డు సభ్యులు రవీందర్, సరిత, శ్రీను, పరమేష్, శివ, గ్రామస్తులు సురేష్, రవీందర్, శంకర్, కృష్ణ, నందు, మున్నా, రవి, సిద్ధు, గిరి, వినోద్, వెంకటేష్, రమేష్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మోహన్ రెడ్డి సహకారంతో నీటి సమస్య పరిష్కారం: కౌన్సిలర్ అఖిల శ్రీనివాస్ గుప్తా

**విశ్వంభర, పరిగి:** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ఇంద్ర నగర్ కాలనీలో నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు వార్డు కౌన్సిలర్ బాదం అఖిల శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ వెంటనే స్పందించి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి స్పందించి వెంటనే సమస్యను పరిష్కారం చేశారు. బోరు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ బాదం అఖిల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. వార్డులో ఏలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ ఛైర్పర్సన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యుబ్, 11వ వార్డు కౌన్సిలర్ ఎజాస్, కో ఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు మిర్జా, బాదం ప్రీతం,నరసింహ జల్సా, అబ్దుల్ అజీజ్, అహ్మద్, సల్మాన్, అస్లాం, సాదక్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం చేయాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీని ఐడీఓసీ నుంచి ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** ఎయిడ్స్ నియంత్రణపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎయిడ్స్ నియంత్రణపై నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్ 1097, క్యూ ఆర్ కోడ్ తో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ర్యాలీ ఐడీఓసీ నుంచి మొదలై సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్ స్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా మానేరు వంతెన వరకు చేరుకొని.. తిరిగి ఐడీఓసీకి చేరుకొని ముగించారు. ఈ అవగాహన కార్యక్రమాలు ఈ నెల 12వ తేదీన మొదలు కాగా, ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ఎయిడ్స్ నియంత్రణపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఎయిడ్స్ రోగ నిర్ధారణ పరీక్షలు వైద్యం, మందులు, కౌన్సెలింగ్ పై వివరించాలని తెలిపారు. పాజిటివ్ కేసులు వచ్చిన చోట పకడ్బందీగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. యువత, విద్యార్థులకు అవగాహన సమావేశాలు, పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి

### ప్రజావాణి అధికారికి సిపిఎం మండల కమిటీ వినతి

**విశ్వంభర, కేసముద్రం:** మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణి అధికారికి సిపిఎం మండల కమిటీ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కమిటీ కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలు గుర్తించి బోర్డులు పెట్టారు, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకొని మున్సిపాలిటీ పరిధిలో క్రీడా మైదానాలు, మినీ పార్కులు ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వ కార్యాలయాల కోసం వినియోగించాలని, అలాగే జ్యోతిబాపూలే సెంటర్లో బస్ షెల్టర్ ఏర్పాటు చేసి, ప్రధాన కూడల్ల లో పబ్లిక్ టాయిలెట్స్ (సులాబ్ కాంప్లెక్స్ )లు నిర్మించాలని, అభివృద్ధి రోడ్ల విస్తరణలో భాగంగా షాపులు కోల్పోయిన, చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారులు, వ్యాపారుల కోసం షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించి ఇవ్వాలని, కేసముద్రం మండలంలో మొదటిసారి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులకు విన్నవించడం జరిగింది, అధికారులు సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని లేనియెడల ప్రభుత్వ భూములను ఎర్రజెండాలు పెట్టి పేదలకు పంచుతామని, ప్రజా సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు చాగంటి కిషన్, నీరుటి జలంధర్, అల్పుగొండ సావిత్ర, బండి దర్గయ్య, నిమ్మల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాలలోని ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు చక్కని క్రమశిక్షణను అలవర్చుకోవాలని, అదే విధంగా ఒక దేశం సార్వభౌమాధికారానికి ప్రతీకగా ఉండే జాతీయ జెండాను గౌరవించడంతో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల జీవితాల నుండి స్ఫూర్తిని పొంది, తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి అధికారి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.సునీతతో పాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## కమాన్‌పూర్‌లో ప్రజావాణి కేంద్రం

**విశ్వంభర, కమాన్ పూర్:** కమాన్ పూర్ మండల కేంద్రం లోని మండల ప్రజా పరిషత్ లో ప్రజావాణి కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం "మండల ప్రజా పరిషత్" కార్యాలయాల్లో సోమవారం నుండి "ప్రజావాణి" కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ "ప్రజావాణి" కార్యక్రమాన్ని ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు "ప్రజావాణి" కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విధితమే. ఇందులో భాగంగా "కమాన్ పూర్ మండల ప్రజా పరిషత్" కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో మండలంలోని వివిధ గ్రామాల్లో నుండి వచ్చిన ప్రజల నుండి అధికారులు విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.





## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**విశ్వంభర, ఘట్కేసర్:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్, పోచారం, ఎదులాబాద్ ప్రాంతాల్లో నాగుల పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎదులాబాద్ సాయిబాబా ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పూజలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగశిలలకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసంలో వచ్చే నాగుల పంచమి పర్వదినాన్ని మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో జరుపుకున్నారు నాగదేవత అనుగ్రహంతో కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని మహిళలు ప్రార్థించారు.

## సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు వినతి



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల కేంద్రంలో ప్రధాన రహదారి మిర్యాలగూడ టు నాగార్జునసాగర్ హైవే పై గల వీధిలైట్లు, మంచినీరు, డంపింగ్ యార్డ్ సమస్యలను పరిష్కరించాలని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో త్రిపురాం గ్రామ సర్పంచ్ బైరం లక్ష్మీ కృష్ణ, టిఆర్ఎస్ నాయకులు కలిసి నల్గొండలోని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్కు వినతిపత్రం అందజేయడం జరిగింది. గత రెండు నెలలుగా హైవే వెంబడి గల వీధి దీపాలు వెలుతురుకు నోచుకోకపోవడం ప్రయాణికులను చిన్న వ్యాపారస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. హైవే కావడం చేత ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ వీధిలైట్ల సమస్యను త్వరగా పరిష్కరించాలని అలాగే గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని డంపింగ్ యార్డ్ వేరే చోటికి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బహిరంగ లక్ష్మి కృష్ణ తో పాటు పలువురు టిఆర్ఎస్ నాయకులు వెంకటరెడ్డి,సుధాకర్ రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు పై ప్రధాని ఫొటో పెట్టాలి



**విశ్వంభర. బొంరాస్ పేట్ :** రేషన్ కార్డు పై ప్రధాని ఫొటో పెట్టాలని బొంరాస్ పేట్ తహసీల్దార్ పద్మావతికి బీజేపీ మండల శాఖ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కొత్త రేషన్ కార్డులో ప్రధాని ఫొటో నూ ముద్రించాలని కోరారు .కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బియ్యం పథకం వివరాలను కార్డులో ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ పై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాబయ్య నాయుడు జగదీష్ సాగర్ పాల్గొన్నారు.

## వీధిలైట్లు వెలిగించాలి



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల కేంద్రంలోని వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు రెమండల రమేష్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి మెరుగు మహేష్ ఈ వినతిపత్రాన్ని అందజేశారు. మిర్యాలగూడ--నాగార్జునసాగర్ హైవే రోడ్డులోని వీధిలైట్లు నెల రోజులుగా వెలగడం లేదని, సాయంత్రం ఆరు గంటల తర్వాత మండల కేంద్రం చీకటిలో మునిగిపోతోందని తెలిపారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. కాంట్రాక్టర్ నిర్వహణ గడువు ముగిసిందని, ఇకపై గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహణ ఉంటుందని తెలిపారని పేర్కొన్నారు. వీధిలైట్ల విద్యుత్ బిల్లుల భారం కూడా పంచాయతీపై పడుతోందని, సమస్యపై జిల్లా కలెక్టర్‌కు సైతం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని నాయకులు తెలిపారు. వెంటనే వీధిలైట్లను పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్, మెరుగు మహేష్, జానకిరామ్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.




## ఎస్ఐ తో ఎమ్మార్పీఎస్ మర్యాదపూర్వక భేటీ

**విశ్వంభర,నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల పోలీస్ స్టేషన్ కు నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై గంగారపు కరుణాకర్ ను ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు తూల్ల వెంకన్న ఆధ్వర్యంలో నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై కి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.శుభాకాంక్షలు తెలిపారు.నూతన ఎస్సై ఆధ్వర్యంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉంటూ,మండలం నేర రహితంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు దండెంపల్లి సైదులు, హెచ్ అశోక్,మంద రమేష్,మంద రవి,ఇసంపెల్లి వెంకన్న, శివార్ల నగేష్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి 16 దరఖాస్తులు



**విశ్వంభర, వలిగొండ:** రాష్ట్ర నోడల్ అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి జి. జలంధర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. మొత్తం 21 శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 16 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

## కేసీఆర్ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా పథకాలను నిర్వీర్యం చేస్తోంది: సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలిచిన గత ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించామని, రూ.51 వేల నుంచి రూ.75 వేలకు, అనంతరం రూ.లక్షకు సాయాన్ని పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ఆ హామీ అమలు కాలేదని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ నిధులను వెంటనే విడుదల చేసి, తులం బంగారం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తయిందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పలువురు రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే వీరేశం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామానికి చెందిన ముత్యాల శివ దశదిన కర్మకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హజరై, వారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీర్నెముల గ్రామ సర్పంచ్ కందిమళ్ళ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కల్లబొల్లి మాటలు మానుకో కేటీఆర్..

**కళ్యాణలక్ష్మి అమలుపై అసత్య ఆరోపణలు సరికాదు**
**మీరు చట్టం చేయనందువల్లే నేడు న్యాయపరమైన సమస్యలు**
**యథావిధిగా పథకాలు అమలవుతాయి**
**బీఆర్ఎస్ దుష్ప్రచారంపై ఇందిరాశోభన్ తీవ్ర ధ్వజం**



**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్నదుష్ప్రచారాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాల అమలుపై చేస్తున్న నిరాధారమైన ఆరోపణలు.. ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పనిచేస్తుంటే, తమ ఉనికిని కాపాడుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేటీఆర్ కల్లబొల్లి మాటలు చెబుతూ, కుట్రపూరితమైన తప్పుడు ప్రచారాలకు తెరతీస్తున్నారని ఆమె దుయ్యబట్టారు.గత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ఏమాత్రం లేదని ఇందిరాశోభన్ స్పష్టం చేశారు. కల్యాణ లక్ష్మి పథకం మీద నేడు అంత ప్రేమ ఒలకబోస్తున్న కేటీఆర్.. మీ తొమ్మిదిన్నరేళ్ల సుదీర్ఘ పాలనలో ఈ పథకానికి సంబంధించి కేవలం ఒక జీవో మాత్రమే తెచ్చారే తప్ప.. అసెంబ్లీలో చట్టం ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పే దమ్ము మీకు ఉందా అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధతతో తీసుకొచ్చిన అభయ హస్తం, బంగారుతల్లి పథకాలను ఎందుకు రద్దు చేశారో సమాధానం చెప్పాలన్నారు. మీరు ఆనాడు కల్యాణలక్ష్మి పథకానికి చట్టబద్ధత కల్పించకపోవడం వల్లే నేడు హైకోర్టులో న్యాయపరమైన సమస్యలు తలెత్తితే.. అసలు ఆ పథకాలనే నిలిపివేస్తున్నారంటూ అబద్ధపు ప్రచారం చేయడమే కాకుండా, ధర్నాల పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవడం నిజంగా సిగ్గుచేటన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల కోసం నిరుపేద ఆడబిడ్డల తల్లిదండ్రులు పడిన కష్టాలు, కార్చిన కన్నీళ్లు తెలంగాణ సమాజం ఇంకా మర్చిపోలేదని ఇందిరాశోభన్ గుర్తుచేశారు. దొరల పాలనలో ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇచ్చే చెక్కులు మంజూరు కావాలంటే స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ, ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగిన పేదల వ్యథలు మీకు గుర్తులేవా కేటీఆర్ అని ఆమె ప్రశ్నించారు. అనేక సందర్భాల్లో లబ్ధిదారులకు పిల్లలు అయ్యాక కూడా చెక్కులు అందలేదని, ఖజానాలో నిధులు లేక చెల్లని చెక్కులు ఇచ్చిన దౌర్భాగ్య పరిస్థితి కూడా కేసీఆర్ పాలనలోనే జరిగిందన్న వాస్తవాన్ని తెలంగాణ ప్రజానీకం ఇంకా మరచిపోలేదని ఆమె విమర్శించారు. నేడు సీఎం రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎటువంటి అవినీతి, దళారీ వ్యవస్థ లేకుండా, ఎవరి వద్దా చేయి చాచాల్సిన అవసరం లేకుండా లబ్ధిదారులకు సకాలంలో సాయం అందేలా పకడ్బందీగా వ్యవహరిస్తోందని ఇందిరాశోభన్ తెలిపారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగుతాయన్నారు. అటు..కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా అబద్ధాలతో కూడిన వ్యంగ్యాస్త్రాలు విసురుతూ దుష్ప్రచారం చేయడం తక్షణం మానుకోవాలని ఇందిరాశోభన్ హితవు పలికారు. బీఆర్ఎస్ పాలనాపరమైన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ విధంగా బురదజల్లుతున్నారని, ఇలాంటి కుట్రలను, కపట నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కేటీఆర్ కు, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే మరోసారి తగిన బుద్ధి చెబుతారని ఇందిరాశోభన్ హెచ్చరించారు.

# మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంపై నిర్లక్ష్యం



**విశ్వంభర, రామన్నపేట:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. అయితే యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు సరైన విధంగా తెలియజేయక పోవడం వలన ప్రజలు ఆశించినంతగా హాజరు కాలేదు. దీంతో ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం అందించి ఉంటే మరింత మంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేవారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరు కాకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. వారి స్థానంలో కింది స్థాయి అధికారులు మాత్రమే హాజరు కావడం జరిగింది. హాజరైనవారిలో ఎంపిడిఓ ఎ.రాములు, మండల తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంఈఓ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. కొందరు హాజరైన అధికారులు సైతం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా తమ సెల్‌ఫోన్లలోనే నిమగ్నమై ఉండటం వారి నిరాసక్తతను, నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది. ప్రజావాణి కార్యక్రమం పట్ల అధికారుల్లో తగిన శ్రద్ధ, బాధ్యత కనిపించలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించాల్సిన వేదిక నిర్లక్ష్యానికి గురవుతోందని విమర్శిస్తున్నారు. ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించినప్పటికీ కేవలం నాలుగు దరఖాస్తులు మాత్రమే రావడం పరిస్థితికి నిదర్శనంగా నిలిచింది. ప్రజావాణి ఉద్దేశం నెరవేరాలంటే గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని, ఈ విషయంలో అధికారులు శ్రద్ధ వహించాలని కోరుతున్నారు. ముఖ్య అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వయంగా వినాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే ప్రజావాణిపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేసి, ప్రజలకు నిజమైన ఉపయోగం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వస్తాకొండూరులో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**విశ్వంభర , గుండాల:** మండలం వస్తాకొండూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పాలబిందెల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా కోటిలింగం,యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శెట్టిపల్లి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త నూతన కమిటీని ప్రకటించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో, పార్టీ నాయకత్వం సూచనల మేరకు చర్చలు జరిపి అందరి సమ్మతితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు నాయకులు తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగాల అనిల్ గౌడ్, మాజీ ఎంపీపీ హరితాదేవి, మాజీ పీసీసీ చైర్మన్ లింగాల భిక్షం, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యూత్ సభ్యులు, నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ ఎన్నికతో వస్తాకొండూరులో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి

### హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా.. రాస్తారోకో



**విశ్వంభర, హుస్నాబాద్:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం హుస్నాబాద్‌లో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచేందుకు నాటి సీఎం కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ.51 వేల నుంచి రూ.1,00,116 వరకు ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఈ పథకాలతో లక్షలాది పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సతీష్‌కుమార్ విమర్శించారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపైనా ఆంక్షలు విధించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పేదల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కోతలు.. ఎగవేతలు.. కూల్చివేతలు' అంటూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల కన్నీళ్లు తుడిచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ , రైతు బీమా, రైతుబంధు పథకాలను యథావిధిగా కొనసాగించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## నోటికి నల్ల రిబ్బన్, ప్ల కార్డ్స్ తో విన్నుత్న నిరసన

**విశ్వంభర, బోడుప్పల్:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బోడుప్పల్ రోడ్లు అధ్వానంగా తయారు అయ్యాయి అని ట్రాఫిక్ జాంతో ఉదయం స్కూల్ కి వెళ్లే విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నారని బిజెపి కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీమంతుల ప్రగతి ఆరోపించారు. నోటికి నల్ల రిబ్బను ధరించి బోడుప్పల్ కమాన్ ప్రధాన రహదారి వద్ద అలాగే సాయిబాబా టెంపుల్ మల్లాపూర్ రోడ్డు పోయే చౌరస్తా ప్రదేశంలో నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న రోడ్డు సమస్యలు సరిపోవు అన్నట్టు మరోప్రక్కన వైన్ షాపుల ముందు భారీగా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నారనీ, కనీసం రోడ్డు ప్యాచ్ వర్క్ లన్న అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తిచేయాలని ప్రజలకు ముఖ్య అవసరాలలో రోడ్డు కూడా ప్రధానమైనది అని, స్థానిక నాయకులు గమనించాలని కశీటెస్టెడ్ కార్పొరేటర్ ప్రగతి అన్నారు. కంటెస్టెడ్ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్,మాజీ మేయర్ అజయ్ యాదవులకు త్వరితగతిన సమస్య ను పరష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లను ఇరుపక్కల తవ్వి చాలా రోజులుగా అలాగే వదిలేసారని త్వరగా రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు ఊరట కల్పించాలని, ట్రాఫిక్ సమస్య నుంచి తప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటెస్టడ్ కార్పొరేటర్ లీలావతి, రమాదేవి, జై కిషన్ నూటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

## ప్రజాసేవతోనే డాక్టరేట్ సాధించారు : దాసోజు శ్రావణ్‌కుమార్



**విశ్వంభర, హైదరాబాదు :** ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ముఠా గోపాల్‌ను కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు డాక్టరేట్ లభించిన సందర్భంగా సోమవారం హైదరాబాదులో సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు అధ్యక్షతన ముఖ్య అతిథిగా పాల్గొన్న దాసోజు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఠా గోపాల్‌కు ప్రజల్లో విశేష ఆదరణ ఉందని అన్నారు. పుస్తకాలను అధ్యయనం చేసి కొందరు డాక్టరేట్ సాధిస్తే, సమాజాన్ని అధ్యయనం చేసి ముఠా గోపాల్ డాక్టరేట్ సాధించారని కొనియాడారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా మాట్లాడుతూ.. తన రాజకీయ గురువు తన తండ్రి ముఠా గోపాల్ అని అన్నారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పనిచేసే వారికి ఉన్నత స్థానాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, సుందర్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, టి. సోమన్, డి. శివముదిరాజ్, తలారి శ్రీకాంత్ ముదిరాజ్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, సుధాకర్ గుప్తా, దీనదయాల్‌రెడ్డి, ఆర్. మోజెస్, బింగి నవీన్, రేషం మల్లేష్, శంకర్ గౌడ్, కె. బాబూరావు, సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఆకుల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అశోక్ కు సన్మానం



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతనంగా నియమితుడైన కటకం అశోక్ ను మహాదేవపూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలోని పద్మశాలీలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నారని, పద్మశాలి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలువురు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పేర్ని గట్టు స్వామి,జిల్లా జనరల్ సెక్రెటరీ మాచర్ల కిరణ్, మహాదేవపూర్ మండల అధ్యక్షుడు పంతకాని సమ్మయ్య, మహాదేవపూర్ పట్టణ అధ్యక్షుడు పంతకాని రాజు,బేగ్లూర్ గ్రామశాఖ అధ్యక్షుడు దూలం సమ్మయ్య, కాళేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడు మాచెర్ల సత్తయ్య, అంబట్ పల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పినగాని రమేష్, సూరారం గ్రామశాఖ అధ్యక్షుడు శామాల సమ్మయ్య,పద్మశాలి సంఘం మహిళా నాయకురాలు భాగ్య, పద్మశాలి సంఘము నాయకులు బాల్నే సమ్మయ్య, మాచర్ల అరుణ్, దూలం రాజయ్య, దోమల ప్రవీణ్ కుమార్, దూలం నగేష్, కొండే దేవేందర్, శ్రీరాముల శ్రీనివాస్, గోరంట్ల రాజు, సభని వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గుండాల ప్రజావాణికి 7 అర్జీలు

**విశ్వంభర, గుండాల:** ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గుండాల మండలంలో సోమవారం మొత్తం 7 అర్జీలు స్వీకరించినట్లు ఎంపీడీవో చండీరాణి తెలిపారు.మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గంగాపురం గ్రామంలోని పాత బావిని పూడ్చివేయడం, గుండాల--జనగాం-సూర్యాపేట ప్రధాన రహదారి వరకు కొత్త రోడ్డు నిర్మాణం, అంబాల గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వినతులు అందజేశారు. అలాగే వెల్మజాల గ్రామంలో ఐకేపీ కేంద్రం ఏర్పాటు, ఏఈపీఆర్ పనుల బిల్లుల విడుదల, ఇందిరమ్మ ఇల్లు, పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులు కూడా వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఖాజీపేట రైల్వే డివిజన్ కోసం ఉమ్మడి ఉద్యమం



విశ్వంభర, బాగ్ లింగంపల్లి: ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీని పరిరక్షించడంతో పాటు ఖాజీపేటను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు కలిసి ఉద్యమించాలని ఎమ్మెల్సీ కోదండరాం పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వీకేసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్ అధ్యక్షతన అయోధ్యపురం భూనిర్వాసితులకు మద్దతుగా నిర్వహించిన సంఘీభావ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల పోరాటాల ఫలితంగానే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం లభించిందని కోదండరాం అన్నారు. ఫ్యాక్టరీని అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఖాజీపేటను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు అనుబంధ పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. స్థానికులకు ఉద్యోగాలు కల్పించడం వారి హక్కు అని అన్నారు. భూములు కోల్పోయిన అయోధ్యపురం బాధితులకు నష్టపరిహారంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పిల్లలమర్రి రవీందర్, జి. ఝాన్సీ, గుడిపల్లి రవి, మన్నారం నాగరాజు, కన్నెగంటి రవి, కోటా శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### హుస్నాబాద్‌లో దారుణం
# సిటిఓను రోకలిబండతో కొట్టి చంపిన భార్య



విశ్వంభర, హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ నగర్ లో దారుణ ఘటన చోటుచేసుకుంది. కాలనీలో నివాసం ఉంటున్న ఇంట్లో భర్త కోటి వెంకటేశ్వర్లు (62) ను భార్య రాజమణి రోకలి బండతో కొట్టి చంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య రాజమణి హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్ఎం గా ఉద్యోగం చేస్తుండగా, భర్త వెంకటేశ్వర్లు ఆసిఫాబాద్ జిల్లాలో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ గా ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెలాఖరులో వెంకటేశ్వర్లు రిటైర్మెంట్ కానుండగా, భార్య, భర్తల మధ్య ఆస్తి పంపకాల విషయంలో ఆదివారం సాయంత్రం గొడవ జరిగింది. గొడవలో వాగ్వాదం పెరిగి భర్త వెంకటేశ్వర్లు తలపై భార్య రాజమణి రోకలి బండతో దాడి చేయగా వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయాలయ్యాయని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వెంకటేశ్వర్లును కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని వెల్లడించారు. మృతుడు వెంకటేశ్వర్లు తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వర్లు పదవి విరమణకు కొద్ది రోజుల ముందు ఈ విషాద ఘటన చోటు చేసుకోవడంతో హనుమాన్ నగర్ లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



విశ్వంభర, సూర్యాపేట: ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డి పి ఓ 8, డిడబ్ల్యుఓ 3, , డి ఏం అండ్ హెచ్ ఓ 3, మిగిలిన 38 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 95 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, డిఇఓ అశోక్, డిపిఓ యాదగిరి, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

# సేవా సామ్రాట్ అవార్డుతో మధు గురూజీకి ఘన సత్కారం



విశ్వంభర, సూర్యాపేట: గత 25 సంవత్సరాలుగా జ్ఞాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు, వృద్ధాశ్రమం, ఆయుర్వేద ప్రచారం, తీర్థయాత్రలు తదితర అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో విశిష్ట సేవలు అందిస్తున్న జ్ఞాన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సూర్యాపేట పట్టణానికి చెందిన మధు గురూజీకి "సేవా సామ్రాట్" అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన జీవనవాహిని ఛారిటబుల్ ట్రస్ట్ మధు గురూజీ సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పబ్లిక్ గార్డెన్ నందు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీ సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపకులు, సద్గురువు బిక్షమయ్య గురూజీ హాజరై మధు గురూజీని ఘనంగా సన్మానించి "సేవా సామ్రాట్" అవార్డును అందజేసి అభినందనలు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా యోగా, ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, వృద్ధుల సంక్షేమం తదితర రంగాల్లో మధు గురూజీ చేస్తున్న సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పలువురు కొనియాడారు. అనంతరం సేవా సామ్రాట్ అవార్డు గ్రహీత మధు గురూజీ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన జీవనవాహిని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ధనలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. సేవ అనేది ఒక కార్యక్రమం మాత్రమే కాదని అది ప్రతి మనిషి బాధ్యత అన్నారు. గత 25 సంవత్సరాలుగా జ్ఞాన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. నాకు లభించిన ఈ 'సేవా సామ్రాట్' అవార్డు వ్యక్తిగత గౌరవంగా కాకుండా, సేవా మార్గంలో నాతో కలిసి నడుస్తున్న ప్రతి ఒక్కరికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను, మరింత స్ఫూర్తిని అందించిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి, అవసరమైన వారికి అండగా నిలిచి, సమాజానికి మరింతగా ఉపయోగపడేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.
మధు గురూజీకి ఈ అవార్డు లభించడం పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన శిష్యులతోపాటు, సూర్యాపేట పట్టణ ప్రజలు, జ్ఞాన ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ మధు గురూజీకి అభినందనలు తెలిపారు.

# ఎంపీడీవో చండీరాణికి అధికారుల సన్మానం



విశ్వంభర, గుండాల: ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న గుండాల ఎంపీడీవో చండీరాణిని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అవార్డు సాధించినందుకు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈపీఆర్ పీ.దామోదర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి టి.భావన, హౌసింగ్ ఏఈ పి.కావ్య, జూనియర్ అసిస్టెంట్ ఆర్.ప్రభాకర్‌రెడ్డితో పాటు పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొని చండీరాణికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో చండీరాణి కనబరుస్తున్న అంకితభావం, సమర్థత, ప్రజాసేవ పట్ల నిబద్ధత అభినందనీయమన్నారు. ఆమెకు దక్కిన ఉత్తమ అవార్డు గుండాల మండలానికి గౌరవాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అవార్డు ద్వారా లభించిన ప్రోత్సాహంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు.

## జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
### : టీడబ్ల్యూజేఎఫ్



విశ్వంభర, హైదరాబాదు : జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సోమవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికల ప్రకటనల బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్‌తో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంచం శ్రీనివాస్, వి.రవికుమార్, ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్. రవికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
## హుస్నాబాద్ నియోజకవర్గంలో 2.30 లక్షల మంది ఓటర్లు




విశ్వంభర, హుస్నాబాద్: హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేసినట్లు ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌ఓ), ఆర్డీవో రామ్మూర్తి తెలిపారు. జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,30,222 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,13,501 మంది పురుషులు, 1,16,715 మంది మహిళలు, ఆరుగురు తృతీయ లింగ ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితాను ఈఆర్‌ఓ కార్యాలయంతో పాటు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించవచ్చని తెలిపారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. పేరు నమోదుకు ఫారం-6, పేరుపై అభ్యంతరానికి ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 ద్వారా సెప్టెంబర్ 16లోపు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను ఈఆర్‌ఓ కార్యాలయంతో పాటు సంబంధిత తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్‌ఓలకు అందజేయవచ్చన్నారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే అర్హులైన యువత కూడా ఫారం-6 ద్వారా ముందస్తుగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం ఉందని రామ్మూర్తి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహదేవ్‌పూర్‌లో పుట్ట మధుకు ఘన స్వాగతం



విశ్వంభర, మహాదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో అమెరికా పర్యటన అనంతరం తొలిసారి మహదేవ్‌పూర్ మండల కేంద్రానికి విచ్చేసిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కి మహదేవ్‌పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ని శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహదేవ్‌పూర్ మండలంలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది.

## రత్నాపూర్ - రామగిరి ఖిల్లా రహదారి వెడల్పుకు తీర్మానం



విశ్వంభర, రామగిరి : రామగిరి మండలం రత్నాపూర్ – రామగిరి ఖిల్లా రహదారి వెడల్పునకు గ్రామస్తులు తీర్మానించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు కొరకు 280 ఎకరాల స్థలంను ప్రభుత్వం సేకరించింది. ఇటీవల రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలు ఈ ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు వెడల్పు చేయించాలని, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 25 ఫీట్ల రోడ్డు ఇవ్వడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. వెంటనే గ్రామంలో మార్కింగ్ చేశారు. తీర్మానం కాపి నీ జిల్లా కలెక్టర్ కు అందనివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక – ప్రశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్, వార్డ్ సభ్యులు పబ్బ స్రవంతి – వెంకటేష్, జక్కుల పద్మ చందన్ కుమార్, కెక్కర్ల ఉషా అశోక్, కండే లక్ష్మి గట్టయ్య, కండే సాహితీ పోశం, అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మని తేజ, వివిధ పార్టీల నాయకులు సందవేన కుమార్, కొండు లక్ష్మణ్, ధర్మల వెంకటేష్, కొవ్వూరి సురేష్, భాద్రపు కృష్ణమూర్తి, కొండు అంజన్న, జీకే యాదవ్, కనవేన సదానందం, పబ్బ మొగిలి, బొంగురల.రవి,ఇజ్జగిరి సంపత్, దాసరి మల్లి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం



విశ్వంభర, ముషీరాబాద్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. హైదరాబాదు ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో జవహర్ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మారిశెట్టి నర్సింగ్‌రావు బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో శీలం సత్యనారాయణ, సురేశ్ యాదవ్, జగదీశ్, నర్సింగ్, సబర్మతి కవిత, బాబూరావు, నవీన్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, దినేశ్, చందు, మురళి, సుబ్బారావు, సంపత్, జగన్, హఫీజ్‌బాయి, రాజేష్, అస్లాం, మధు, నరేందర్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జీవో 97 రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నిరసన



విశ్వంభర, సికింద్రాబాద్ : డిప్లమా కోర్సులను ఐటీఐలతో అనుసంధానం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకొని జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె. అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లెనిన్, ఉపాధ్యక్షుడు నాగేందర్, ప్రవీణ్, అరవింద్, భరత్, కార్తిక్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా రథోత్సవం



విశ్వంభర, ఘట్కేసర్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎదులాబాద్ శ్రీ గోదా రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. రథోత్సవానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి రథాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తుల సందడితో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ రథోత్సవానికి మేడ్చల్ ఎమ్ ఎల్ ఏ చామకూరా మల్లా రెడ్డి అంబర్ పేట్ ఎమ్ ఎల్ ఏ కాలేరు వెంకటేష్ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## కళ్యాణ లక్ష్మి కొనసాగించాలని బిఆర్ఎస్ ధర్నా




విశ్వంభర, ఇనుగుర్తి: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కోరుతూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రం ఇనుగుర్తి తహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు డిప్యూటీ తహసిల్దార్ తరంగిణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరానికి ప్రతీకని దీనిని హైకోర్టు తీర్పును సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో సంబంధిత పథకానికి మరో తులం బంగారం జతచేసి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు హామీని అమలు చేయకపోగా ఏకంగా పథకాన్ని రద్దు చేయడానికి పావులు కదుపుతుండడం దారుణమన్నారు.పథకాన్ని ఎత్తివేయాలని చూస్తే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విజయ్ యాదవ్ మహేందర్ రెడ్డి గండు నాగన్న గౌడ్ వేముల శ్రీనివాస్,చెడుపాక యాకూబ్, రాయలి ఉప్పలయ్య,వడపల్లి సందీప్ గౌడ్,పప్పుల వెంకన్న,బైరు వినయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి



విశ్వంభర, మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులకు ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ అదావత్ అశోక్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో ఆర్డీవోకు మెమోరాండం సమర్పించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో ప్రస్తుతం లబ్ధిదారులు నివసిస్తున్నప్పటికీ, వారికి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇళ్లపై చట్టపరమైన హక్కులు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో అంబటి వెంకటకృష్ణ, నాగునాయక్, లక్ష్మారెడ్డి, కొట్ట ఆంజనేయులు, కొమ్ముకోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 97ను రద్దు చేయాలి

# ఏబీవీపీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

పలువురు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు అరెస్ట్





విశ్వంభర, హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సోమవారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక విద్యను 'శక్తి' విభాగంలో విలీనం చేస్తూ తీసుకొచ్చిన జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగిస్తూ పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్, ఐటిఐ, లేబర్ డిపార్ట్‌మెంట్‌లను ఒకే విభాగం కిందకు తీసుకురావడం వల్ల సాంకేతిక విద్యా వ్యవస్థకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆరోపించారు. విలీనాలపై దృష్టి పెట్టకుండా కళాశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక కోర్సులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అనుసంధానం, మెరుగైన ప్లేస్‌మెంట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 97ను వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని, ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని సావుల ఆదిత్య హెచ్చరించారు. విద్యార్థుల రాస్తారోకో నేపథ్యంలో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని నచ్చజెప్పారు. విద్యార్థులు వినకపోవడంతో పలువురు ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాహుల్, నగర కార్యదర్శి రాజు, నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, మేఘన, రవళి, సంధ్య, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా బట్టి సురేందర్



విశ్వంభర, హనుమకొండ: హనుమకొండ జిల్లా కేంద్రంలో అంబల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా బట్టి సురేందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపసర్పంచ్ లకు గౌరవప్రదమైన వేతనం ఇవ్వాలని, ప్రజాస్వామిక బద్దంగా గెలిచిన ఉపసర్పంచ్ లకు శిలాఫలకాలపై పేరు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చూపాలని డిమాండ్ చేశారు కొంతమంది సర్పంచులు కావాలనే ఉపసర్పంచ్ చూస్తున్నారని, అలా చేసే ఉపసర్పంచ్ ఇండ్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు వివిధ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## 23న హుస్నాబాద్‌లో డీటీఎఫ్ జిల్లా విద్యాసదస్సు



విశ్వంభర, హుస్నాబాద్: డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గడ్డం లక్ష్మారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ నెల 23న హుస్నాబాద్‌లో సిద్దిపేట జిల్లా విద్యాసదస్సు, అభినందన సభ నిర్వహించనున్నట్లు డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా సేవలందించిన లక్ష్మారెడ్డి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని, డీటీఎఫ్‌లో పలు బాధ్యతలు నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. సదస్సులో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ డా. బి. రామకృష్ణ విద్యారంగానికి సంబంధించిన అంశాలపై ప్రసంగించనున్నారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, డీటీఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ స్నేహ శబరీష్



విశ్వంభర, మహబూబాబాద్: ప్రజావాణిలో అందే ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అనిల్‌కుమార్, పురుషోత్తం, డీఆర్ఓ నాగవాణితో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ, మున్సిపల్, పంచాయతీ సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారని తెలిపారు. మొత్తం 110 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తమ అధికారిక లాగిన్‌లను ప్రతిరోజూ పరిశీలించి పెండింగ్ అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీపై తీసుకున్న చర్యలను దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, తిరస్కరించే సందర్భంలో కారణాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు బదిలీ చేసి, నిర్ణీత సమయంలో పరిష్కరించి నివేదిక అందజేయాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు, భోజనం, తాగునీరు, పరిశుభ్రత, మెనూ అమలు, విద్యార్థుల హాజరును పరిశీలించేందుకు అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి

: ప్రజావాణిలో వినతి



విశ్వంభర, నెల్లికుదురు: మండలంలోని మునిగల వీడు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కరెంటు సరఫరా సరిగా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని బిజెపి,సిపిఎం, సిపిఐ నాయకులు సోమవారం నెల్లికుదురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.సంబంధిత దరఖాస్తును ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, తహసిల్దార్ చంద నరేష్,ఎంపీడీవో సింగారపు కుమార్ లకు అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నల్లాని పాపారావు, సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు, సిపిఐ మండల కార్యదర్శి బైసా స్వామి మాట్లాడుతూ.. సంబంధిత సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మునిగలవీడు, మదనదుర్తి, శ్రీరామగిరి, బంజార, బొజ్జన్నపేట గ్రామాలతో పాటు వాటి శివారుతండాల రైతులు సాగు చేసిన పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్ మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇసంపల్లి రమేష్ పాల్గొన్నారు.

## కేసీఆర్ పథకాలను రద్దు చేసేందుకే కుట్ర : ముఠా గోపాల్




విశ్వంభర, ముషీరాబాద్ : కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ముఠా గోపాల్ ఆరోపించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపుతో సోమవారం హైదరాబాదు ముషీరాబాద్ చౌరస్తాలో పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంతో ముషీరాబాద్ చౌరస్తా నుంచి గాంధీ ఆసుపత్రి వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహా, వై. శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, బింగి నవీన్, శంకర్ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి రద్దు చేస్తే ఊరుకోం: బిఆర్ఎస్

పథకం కొనసాగించాలని నెల్లికుదురులో ధర్నా



విశ్వంభర, నెల్లికుదురు: కళ్యాణ లక్ష్మి పథకం రద్దు చేస్తే ఊరుకోమని బిఆర్ఎస్ మండల కార్యదర్శి వెన్నాకుల శ్రీను ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కొనసాగించాలని కోరుతూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహబూబాబాద్- తొర్రూరు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహసిల్దార్ చంద నరేష్ కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెన్నాకుల శ్రీను మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయడంతో కేటి ఆర్ ఇచ్చిన పిలుపుమేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరానికి ప్రతీక అని దీనిని హైకోర్టు తీర్పును సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో సంబంధిత పథకానికి మరో తులం బంగారం జతచేసి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు హామీని అమలు చేయకపోగా ఏకంగా పథకాన్ని రద్దు చేయడానికి పావులు కదుపుతుండడం దారుణమన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కేసీఆర్ ప్రభుత్వం రూ.51 వేల తో ప్రారంభించి రూ. 75 వేల116, అనంతరంరూ.1లక్ష 116 రూపాయలకు పెంచాలని గుర్తు చేశారు. పథకాన్ని ఎత్తివేయాలని చూస్తే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో మేచరాజు పల్లి సర్పంచి తూర్పాటి శంకరయ్య నాయకులు ఎర్రబెల్లి నవీన్ రావు, భోజ్యా నాయక్, భీముడు, అనిల్, ఎండి రహమాన్,ఎడ్ల మహేష్,హెచ్చు అశ్విన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



విశ్వంభర, వలిగొండ: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు కూర శ్రీనివాస్ మాట్లాడుతూ వలిగొండ నుంచి భువనగిరికి వెళ్లే బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి ప్రమాదాల నివారణకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. నూతన పింఛన్ల మంజూరుకు వికలాంగులు సదరం సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున గడువు పొడిగించాలని, లేదా మండలాల్లో ప్రత్యేక సదరం క్యాంపులు ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించి కార్యక్రమం లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, కల్కూరి రామచందర్, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, కొండూరు సత్తయ్య, శీలం ఇందిర, దొడ్డి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు: తుంగతుర్తి రవి




విశ్వంభర, పీర్జాదిగూడ: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌పై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు సోమవారం పీర్జాదిగూడలోని బండి కన్వెన్షన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ ఉపసర్పంచ్, సర్పంచ్‌గా ప్రజలతో మమేకమై సేవలందించారని, ఎన్నికల్లో ఓడిపోయినా నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. ఆధారాలు లేకుండా భూకబ్జాల ఆరోపణలు చేయడం సరికాదని, ఆరోపణలు నిజమైతే ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆరోపణ లకు ఆధారాలు చూపించాలని, లేనిపక్షంలో వజ్రేష్ యాదవ్‌కు క్షమాపణ చెప్పి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి జలేందర్‌రెడ్డి, రాజేష్, బండి శ్రీరాములు, దర్గా పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు




విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలో నకరకంటి గణేష్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మారక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గంజాయి, మందు, గుట్కా, సిగరెట్ పదార్థాలకు విద్యార్థులు, గ్రామ ప్రజలు దూరం ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్నపేట మండల సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.సతీష్ హాజరై మాట్లాడుతూ, విద్యార్థులను చైతన్యపరిచి గ్రామ ప్రజలు చెడును అరికట్టాలని సూచించారు. అదే విధంగా సదస్సుకు అతిథిగా విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామానికి చెందిన డాక్టర్ ఎన్.అశోక్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు మానవ సంబంధాలను దెబ్బ తీస్తాయని, కుటుంబాలు కుంటుపడి దిక్కు తోచకుండా కుటుంబాలను దిగదార్చు తాయని, విద్యార్థులను ప్రజలను చైతన్యం చేస్తూ, మత్తు పదార్థాలను ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై ఉక్కు పాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు చదువులలో గమ్యాలకు చేరి వెల్లంకి గ్రామంలో వెలుగులు నింపాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాసు, మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, సభాధ్యక్షులు ప్రధాన ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, ఉపాధ్యాయుల బృందం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, వార్డ్ మెంబర్ గంజి భాస్కర్, గోధుమల సోమప్ప, ఎడ్ల సంజీవరెడ్డి, ఢిల్లీ ప్రమోదర రెడ్డి, తాటిపాముల స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం: డిఎస్పీ



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట డివిజన్ కార్యాలయం నందు డిఎస్పీ ప్రసన్న కుమార్ పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి బాధితుల నుండి పిర్యాదులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్యలు సంభదిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం డివిజన్ స్థాయి పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగినది అని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపినారు.

## నల్లగొండలో ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభలు

విశ్వంభర, చిక్కడపల్లి : అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 36వ జాతీయ మహాసభలను నవంబర్ 18 నుంచి 21 వరకు నల్లగొండలో నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ తెలిపారు. సోమవారం హైదరాబాదు సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభల్లో రైతు సమస్యలు, మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టులు, రైతు భరోసా నిధులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. రైతులు, రైతు శ్రేయోభిలాషులు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ శోభన్, నంద్యాల నర్సింహారెడ్డి, పి. జంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, కందాల ప్రమీల, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అన్ని సామాజిక వర్గాల ప్రజలు సహకరించాలి : మహమూద్ ఖాతూన్



విశ్వంభర, మహబూబాబాద్: తన భూమి వివాదంపై తాను చేపట్టబోయే పోరాటానికి జిల్లా కేంద్రంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు సహకరించాలని మహమూద్ ఖాతూన్ కోరారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. భర్త మృతిచెందిన అనంతరం తన పేరుపై భూమి బదలాయింపు జరగాల్సి ఉండగా, కొందరు భూకబ్జాదారులకు అధికారులు సహకరిస్తూ రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. తన కుమారులు భూమి వద్దకు వెళ్లినప్పుడు దాడులకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, 82 ఏళ్ల వయసులో తానే స్వయంగా రెండుసార్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. భూకబ్జాదారుల వేధింపులతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని, తన కుమారులకు ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబంపై ఏదైనా దాడి జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. భూమి వివాదంపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి తహసీల్దార్, పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని, భూకబ్జాదారులకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకుని తమకు తక్షణమే న్యాయం చేయాలని మహమూద్ ఖాతూన్ కోరారు.

## నల్గొండ జిల్లా పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



విశ్వంభర, భువనగిరి: భువనగిరి పట్టణంలోని న్యూ వివేరా హోటల్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశానికి ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ వివిధ కమిటీల ఏర్పాటు, తాజా రాజకీయ పరిస్థితులు, ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యాచరణ, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

## గడికోటలో మూడు రోజుల పాటు వైభవంగా అమ్మవారి పునఃప్రతిష్ఠ



విశ్వంభర, మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. తొలిరోజు వేద ఆశీర్వచనం, గోపూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన తదితర కార్యక్రమాలతో పాటు సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, హోమాలు, జలాధివాసం, మంగళహారతి నిర్వహించనున్నారు. 18న గణపతి, రుద్ర, నవగ్రహ, అమ్మవారి మూలమంత్ర హోమాలు చేపట్టనున్నారు. 19న యంత్ర ప్రతిష్ఠతో పాటు ఉదయం 8.29 గంటలకు అమ్మవారి ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నారు. అనంతరం మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయి.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ ఖుష్బూ




విశ్వంభర, మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 93 ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియలు ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ఎప్పటిక ప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజావాణి అనంతరం బ్రహ్మకుమారీల ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న 'వ్యసన ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా జిల్లా అధికారుల తో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీల ప్రతినిధులు మాట్లాడుతూ, వ్యసన ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో ప్రతిజ్ఞ చేయించాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 20 వరకు 'దాది ప్రకాశ్‌మణి' స్మారకార్థం రక్తదాన శిబిరాలు, వ్యసన విముక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలతో పాటు మొబైల్ ఫోన్, స్క్రీన్ వినియోగం, ప్రతికూల ఆలోచనలు, పనులను వాయిదా వేయడం వంటి అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన ముక్త్ మహబూబ్‌నగర్, వ్యసన ముక్త్ తెలంగాణ, వ్యసన ముక్త్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ స్టేజ్-1 విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. తదుపరి దశ సెన్సస్ ప్రక్రియలో భాగంగా 'జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్' కోసం అవసరమైన సమాచారాన్ని శాఖల వారీగా వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో సేకరిస్తున్నట్లు తెలిపారు. 31 సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్లు తమ పరిధిలోని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఈ నెల 20 లోగా జిల్లా ప్రణాళిక శాఖకు పంపించాలని ఆదేశించారు. సెన్సస్‌కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను భద్రంగా ఉంచాలని సూచించారు. సెన్సస్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా ప్రణాళిక శాఖ ఇన్‌చార్జి అధికారి బి.నర్సింహులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయపు పన్ను ఎగవేత తీవ్రమైన నేరం

**పన్ను చెల్లింపుదారులకు పూర్తి సహకారాన్ని అందిస్తాం**
**ఫిర్యాదులను తీసుకొని సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం**
**ఆదాయపు పన్ను కమిషనర్ (అప్పీల్స్) షానవాజ్ ఉల్ రహమాన్**




విశ్వంభర, హైదరాబాద్: భారతదేశంలో ఆదాయపు పన్ను ఎగవేత అనేది 1961 ఆదాయపు పన్ను చట్టం ప్రకారం తీవ్రమైన నేరం అని, దీనికి విధించే కఠినమైన శిక్షలలో ఎగవేసిన పన్నుపై 300% వరకు ద్రవ్య జరిమానాలు, ఆస్తుల జప్తు, మరియు 7 సంవత్సరాల వరకు కఠినమైన కారాగార శిక్షలు విధించబడుతాయని రాష్ట్ర ఆదాయపు పన్ను కమిషనర్ (అప్పీల్స్) షానవాజ్ ఉల్ రహమాన్ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ , తాజ్ త్రిస్టార్ హోటల్ లో సోమవారం తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ మరియు రాష్ట్ర ఆదాయపు పన్ను శాఖ సంయుక్తాధ్వర్యంలో ఛార్టర్డ్ అకౌంటెంట్స్ , పన్ను న్యాయవాదుల కోసం టి.డి.ఎస్, ఐ.టి.ఆర్ ఫైలింగ్, సి.పి.సి ప్రాసెసింగ్ వంటి సంబంధిత అంశాలపై ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని షానవాజ్ ఉల్ రహమాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించగా రాష్ట్ర అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ ఎస్.ఏ. మతివనన్, రాష్ట్ర సంయుక్త ఆదాయపు పన్ను కమిషనర్ బి. మాలతీ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షానవాజ్ ఉల్ రహమాన్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి వ్యక్తి లేదా సంస్థల ఆదాయపు రాబడి, ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలు డిజిటల్ రికార్డుల రూపంలో ఆదాయపు పన్ను శాఖ వద్ద ఉంటుందని, ఉద్దేశపూర్వకంగా ఆదాయాన్ని తక్కువగా చూపించడం, అర్హత లేని మినహాయింపులు లేదా క్రెడిట్‌లను పెంచి చూపించడం, లేదా డబ్బు లేదా ఆస్తులను విదేశాలలో దాచిపెట్టడం కచ్చితంగా నేరపూరితమైన చర్యగా పరిగణించబడుతుందని, కటకటాలు తప్పవని హెచ్చరించారు. పన్ను చెల్లింపుదారులందరూ ప్రతి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను దాఖలు గడువు కాలంలో తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లను తప్పనిసరిగా దాఖలు చేయాలన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపులలో పన్ను చెల్లింపుదారులకు పూర్తి సహకారాన్ని అందిస్తామని, వారి ఫిర్యాదులను తీసుకొని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రజలు ఆదాయపు పన్నును చెల్లించడంలో గల ప్రయోజనాలపై అవగాహన కల్పించడంలో చార్టర్డ్ అకౌంటెంట్లకు అధిక బాధ్యత కలిగిఉందాలని, చార్టర్డ్ అకౌంటెంట్ లు పౌరుల తరఫున రిటర్న్‌లను పారదర్శకంగా దాఖలు చేయడమే కాకుండా, చట్టం నిర్దేశించిన కనీస పన్నును వారు చెల్లించేలా చూసుకుంటూ, పన్ను ప్రణాళికపై సలహాలు ఇవ్వాలని కోరారు. ఆదాయపు పన్ను చెల్లించడం వల్ల వ్యక్తిగతంగా ప్రయోజనం చేకూరడమే కాకుండా, మన దేశాభివృద్ధికి కూడా అది దోహదపడుతుందని ప్రజలు, సీఏ లు గుర్తించుకోవాలని షానవాజ్ ఉల్ రహమాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.పి. దహియా, కార్యదర్శి పంకజ్ సంచేటి, నారాయణ రావు, కోశాధికారి వంకట్ సంచేటి, సలహాదారులు అమృత్ కుమార్ కోట, రాందేవ్ బూతాడా, పూర్వ అధ్యక్షులు చంద్రశేఖర్ వేములు, కె. దేవదాస్, ఈశ్వరన్, జిసి సభ్యులు ఆషిష్ జోషి, లీల కృష్ణ మోహన్, సోమేశ్వర్, అల్యూజావర్, అర్జున్, జె. సోలంకి పాల్గొన్నారు.

# రూ. 1.5 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం-ఆరుగురు అరెస్ట్



విశ్వంభర, హైదరాబాద్ :వెండితెరపై థ్రిల్లర్ సినిమాల్లో చూసే డ్రగ్స్ స్మగ్లింగ్ దందాను తలపిస్తూ.. కడుపుకి, రెండు కాళ్లకు టేపుల్ సెల్లో టేపులతో డ్రగ్స్ ప్యాకెట్లను చుట్టుకొని డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటీ, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్ట్ చేసి రూ. 1.5 కోట్ల విలువైన 12 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఎల్బీనగర్ క్యాంప్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏపీ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు భారీగా హాష్ ఆయిల్ రవాణా అవుతుందని ఎల్బీనగర్ ఎస్ఓటీ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వనస్థలిపురం పోలీసులతో కలిసి చింతల్‌కుంట ప్రాంతంలో బెంగళూరు బస్సు ఎక్కేందుకు ప్రయత్నంలో ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆరుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడగా అందులో ఒక మహిళ, ఇద్దరు మైనర్లు ఉన్నారు.జెమ్మిలి శ్రీను పాత నేరస్థుడు. గతంలో ఏపీలోని నర్సీపట్నం, అడవి అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదైంది. జైలు నుంచి విడుదలైన తరువాత ఏపీలోని చింతపల్లికి చెందిన కృష్ణ(సైప్రయర్), బెంగళూరుకు చెందిన సీజో(రిసీవర్)లతో కలిసి బెంగళూరుకు హాష్ ఆయిల్ రవాణా చేసేందుకు ప్లాన్ చేశారు. జెమ్మిలి శ్రీను అతని భార్య నలియా అలియాస్ అమ్ములతో కలిసి ఏపీలోని ఏజెన్సీ ప్రాంతానికి చెందిన అమాయక గిరిజన యువకులకు డబ్బులు ఆశ చూపి డ్రగ్స్ రవాణాకు క్యారియర్లుగా వాడుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు చిక్కుడు సరన్, వంగి జగదీష్‌లతో పాటు ఇద్దరు మైనర్లను హాష్ స్మగ్లింగ్‌లో క్యారియర్లుగా ఎంచుకున్నారు. శ్రీను దంపతులు హాష్ ఆయిల్ ప్యాకెట్లను నలుగురు క్యారియర్ల శరీరానికి అమర్చి, వారిని ప్రైవేట్ ట్రావెల్స్‌లో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఆ నలుగురికి, శ్రీను దంపతులకు ఎలాంటి సంబంధం లేకుండా ఆరుగురు ఒకే వాహనంలో ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వచ్చిన ఈ ఆరుగురు వనస్థలిపురం ప్రాంతంలో బస్సు దిగి, బెంగళూరుకు వెళ్లేందుకు మరో బస్సులో ప్రయాణానికి సిద్ధమవుతుండగా ఈ ముఠాను ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. 12 కిలోల హాష్ ఆయిల్‌ను బెంగళూరులో రిసీవర్‌కు అప్పగించడంతో ఒకో ట్రిప్పుకు రూ. 10 లక్షలు జెమ్మిలి శ్రీను దంపతులకు వస్తాయని కమిషనర్ తెలిపారు. అందులో కొంత మొత్తం క్యారియర్లకు ఇస్తారని తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ప్రధాన సైప్లయర్ దారు కృష్ణ, రిసీవర్ సీజో కోసం గాలిస్తున్నట్లు సీపీ తెలిపారు.

ఎస్ఓటీ డీసీపీ మనోహర్ నేతృత్వంలో అదనపు డీసీపీ షకీర్ హుస్సేన్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి బృందం ఈ ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించింది. ఎస్ఓటీ పోలీసులతో పాటు వనస్థలిపురం పోలీసులకు సీపీ అభినందనలు తెలిపారు.పోలీసుల తనిఖీల్లో స్మగ్లింగ్ చేస్తున్న ఈ ముఠా ఎవరికీ అనుమానం రాకుండా ఒక్కొక్కరు తమ పొట్ట చుట్టూ ఒక కేజీ హాష్ ఆయిల్ ప్యాకెట్, కుడి కాలికి , ఎడమ కాలికి కేజీ చొప్పున ఒక్కొక్కరు మూడు కేజీల హాష్ ఆయిల్ ప్యాకెట్లను బ్రౌన్ టేపులతో శరీరానికి అంటించి ఆపైన దుస్తులు ధరించి ఎవరికీ అనుమానం రాకుండా సాధారణ ప్రయాణికుల మాదిరిగా తిరుగుతున్నారు. ఎలాంటి బ్యాగ్‌లు లేకుండా, శరీరానికి అంటుకున్నట్లు హాష్ ఆయిల్ ప్యాకెట్లను చుట్టి దుస్తులు ధరించి రవాణా చేస్తున్నారు. నలుగురు ఇలా హాష్ ఆయిల్ క్యారియర్లు 12 కిలోల హాష్ ఆయిల్‌ను శరీరంపై కట్టుకొని తీసుకెళ్తున్నారు. ఈ నలుగురిని గంజాయి సైప్లై చేసే వాళ్లను ఇద్దరు పెడ్లర్లు వారిని వెంబడిస్తున్నట్లు గుర్తించారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలి



విశ్వంభర, సరూర్‌నగర్: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించడంతో పాటు తులం బంగారం హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి ఆదేశాలతో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించేందుకు ప్రభుత్వం హైకోర్టులో దాఖలైన కేసుపై వెంటనే స్పందించాలని, పేద ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే ఈ పథకాలతో పాటు తులం బంగారం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే పథకాలను నిలిపివేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయిలీలని శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు పెద్దాల నగేష్, గౌడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, సాజిద్, కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి పెరిగిన రిటైర్మెంట్ బెనిఫిట్స్

విశ్వంభర, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం పెంచిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందిస్తోంది. 60 ఏళ్లు దాటిన వారు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగినా ఈ ప్రయోజనాలు వర్తిస్తాయని అధికారులు తెలిపారు.కొత్త ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ అందిస్తున్నారు. గతంలో ఉన్న ప్రయోజనాలతో పోలిస్తే పెంచిన మొత్తంతో పదవీ విరమణ చేసే సిబ్బందికి మరింత ఆర్థిక భరోసా కలగనుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,572 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.15.61 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్లు వెల్లడించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్న సిబ్బంది పదవీ విరమణ అనంతరం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ ప్రయోజనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నికల్లో పీవీకే ప్యానల్ విజయం



విశ్వంభర, మీర్‌పేట్: నంది హిల్స్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయ 2026 నిర్వహణ కమిటీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి. పార్వతి వినాయక కైలాసం (పీవీకే) ప్యానల్ 42 ఓట్ల ఆధిక్యంతో జైపాల్‌రెడ్డి ప్యానల్‌పై ఘన విజయం సాధించింది.మొత్తం 756 మంది సభ్యత్వం నమోదు చేసుకోగా, 671 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల్లో విజయం సాధించిన పీవీకే ప్యానల్ తరఫున నూతన కమిటీగా అధ్యక్షుడిగా కె. చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి. లక్ష్మీనారాయణ, కోశాధికారిగా పి. వేమిరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి. కృష్ణారెడ్డి, ఎన్. భోజయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎ. శ్రీహరి, బి. సంజీవ్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి. రవి, కె. మురళి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వి. ప్రవీణ్‌కుమార్, రెడ్యా నాయక్ ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. నంది హిల్స్ కాలనీవాసుల సమక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి పీవీకే ప్యానల్‌ను విజేతగా ప్రకటించారు.

## 34 ఏళ్లుగా విభిన్న సేవా కార్యక్రమాలు



విశ్వంభర, ఎల్బీనగర్: గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్ (4 సార్లు), రచయిత, సామాజిక సేవకుడు, పర్యావరణవేత్త, 400 పాత్రల్లో నటించిన కళాకారుడు డా. పెండెం కృష్ణకుమార్ తన పుట్టినరోజు సందర్భంగా నాగోల్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పలు సామగ్రిని అందజేశారు. పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాలు, వాటర్ క్యాన్లు, మెడికల్ కిట్, గోడ గడియారం, ఆట వస్తువులు, ఇండియా, ప్రపంచ, తెలంగాణ మ్యాప్‌లను అందించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. గత 34 ఏళ్లుగా సుమారు 400 పాఠశాలలకు బెంచీలు, కుర్చీలు, జాతీయ నాయకుల చిత్రపటాలు, వాటర్ క్యాన్లు, క్రీడా సామగ్రి తదితర అవసరమైన వస్తువులను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే చెవిటి, మూగ, దృష్టిలోపం, వికలాంగుల పాఠశాలలకు చాక్‌పీసులు, క్యాండిల్స్, మిషన్లు, బ్రెయిలీ స్లేట్లు, వాకింగ్ స్టిక్‌లతో పాటు అవసరమైన ముడి పదార్థాలను అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఇన్‌చార్జి సుధాకర్, పిచ్చిరెడ్డి, శ్రీదేవి, మాధవీలత, జయప్రద, పద్మ, శివయ్య, బషీర్‌ఖాన్, మాధవి, శంకర్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష



విశ్వంభర, నాగోల్: పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది.నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసు లో నిందితుడు ఉప్పు రాకేష్ (24)ను కోర్టు దోషిగా నిర్ధారించింది. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధించింది. బాధితురాలికి రూ.50,000 పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ కేసులో నాగోల్ ఎస్ఐ పి. శివ నాగ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. అదనపు పీపీలు శోభారాణి, పి. సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు విచారణలో నాగోల్ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజు, సమన్స్ కానిస్టేబుల్ వెంకటేష్, ఏఎస్సై పి. శోభ సహకరించారు.

## నాగుల చవితి వేడుకల్లో మహిళల ప్రత్యేక పూజలు



విశ్వంభర, అంబర్‌పేట :నాగుల చవితి సందర్భంగా నగరవ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం హైదరాబాదు అంబర్‌పేట డీసీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని నాగుల పుట్టల వద్ద మహిళలు పెద్ద ఎత్తున హాజరై పూలు, కుంకుమ, పసుపు, పాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో జైహింద్ పవిత్ర, సత్య, మాలతి, శోభా, రజిత, మాధవి, సూర్యకళ, డాక్టర్ కృష్ణవేణి, హేమలత, సుజాత రెడ్డి, మణి, సుజాత, విమల, లక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

## కళలకు ప్రభుత్వం పెద్దపీట: జూపల్లి




విశ్వంభర, రవీంద్రభారతి : హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతులు, కళారూపాలకు నిలయమని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్చరల్ ఫెస్టివల్--2026లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 16 రకాల కళారూపాలను 170 మంది కళాకారులు ప్రదర్శించారు. భరతనాట్యం, నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ, మైమ్ షో, పపెట్ షోలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

## ఉద్యాన వర్సిటీలో హార్టికల్చర్ రీసెర్చ్ కాంప్లెక్స్



విశ్వంభర, హైదరాబాద్ : ఉద్యానవన రైతులకు కావాల్సిన పూర్తిస్థాయి విజ్ఞానాన్ని అందించేందుకు శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఉద్యాన రీసెర్చ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ ఉద్యాన రీసెర్చ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ రీసెర్చ్ కాంప్లెక్స్‌లో కూరగాయలు, పూలు, సుగంధ, ఔషధ పంటల సాగులో విత్తనోత్పత్తి, నూతన రకాలు, పంటల అభివృద్ధి, చీడపీడల నివారణ వంటి అంశాలపై పరిశోధనలు చేసి, రాష్ట్ర రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వీసీ దండ రాజిరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు.

## మరో వెయ్యి బడుల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్



విశ్వంభర, హైదరాబాద్ : మరో వెయ్యి సర్కార్ బడుల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రస్తుతం వెయ్యి బడుల్లో ఈ యూనిట్లు ఉండగా, ఈ విద్యాసంవత్సరం మరో వెయ్యి బడుల్లో యూనిట్లు నెలకొల్పనున్నామని తెలిపారు. కొంపల్లిలోని శిక్షణకేంద్రంలో అధునాతన వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రాక్ సహా మరికొన్ని వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. పనులు పూర్తైన తర్వాత విద్యార్థులకు శిక్షణనిస్తామని, అత్యుత్తమ సేవలందించిన వారిని త్వరలోనే సన్మానించబోతున్నామని తెలిపారు.

# తొలి టెస్టుపై పట్టు బిగించిన టీమిండియా..



## తొలి ఇన్నింగ్స్‌లో 178 రన్స్ ఆధిక్యం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టుపై టీమిండియా పట్టు బిగించింది. బౌలర్లు మెరవడంతో సోమవారం కూడా భారత్ ఆధిపత్యం కొనసాగింది. ముందుగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేసింది. సోమవారం ఉదయమే బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక.. ఇండియాకు పోటీనివ్వలేకపోయింది. స్పిన్నర్లు మానవ్ సుతార్, రవీంద్ జడేజా స్పిన్ మాయలో చిక్కుకుని లంక జట్టు విలవిలలాడిపోయింది. టాప్-5 బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూకట్టారు. అయితే, దినూష(100) సెంచరీతో కదం తొక్కగా.. డిక్వెల్లా(8) కూడా రాణించాడు. దీంతో శ్రీలంక జట్టులో జోష్ వచ్చినప్పటికీ అది ఎంతో సేపు లేదు. భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు 284 పరుగుల వద్ద ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 178 పరుగుల భారీ ఆధిక్యం సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 500 పరుగుల మార్క్‌ను అందుకోలేకపోయింది. సోమవారం ఆట ప్రారంభమైన తొలి ఓవర్‌లోనే ఇండియా ఆట ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 460/9తో ఆ కొనసాగించిన భారత్ కేవలం రెండే రన్స్ చేసింది. 10వ వికెట్‌గా ప్రసిద్ధ్ కృష్ణ అవుటయ్యాడు. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో అతను పెవిలియన్ చేరడంతో భారత్ ఆలౌటైంది. 116.4 ఓవర్లు ఆడిన ఇండియా 462 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(167) భారీ శతకం బాదగా.. కేఎల్ రాహుల్(82), ధ్రువ్ జురెల్(51) కూడా రాణించిన విషయం తెలిసిందే.

**సుతార్, జడేజా స్పిన్ మాయ..**

భారత స్పిన్నర్లు మానవ్ సుతార్, రవీంద్ర జడేజా తమ స్పిన్ మంత్రంతో శ్రీలంకను బెంబేలెత్తించారు. సుతార్ 4 వికెట్లతో విజృంభించగా.. జడేజా 3 వికెట్లు తీసి లంక పతనాన్ని శాసించారు. సోమవారం తొలి ఓవర్‌లోనే బ్యాటింగ్‌కు దిగిన ప్రత్యర్థి జట్టుకు ఆరంభంలోనే వరుసగా షాక్‌లు తగిలాయి. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో(0)ను సిరాజ్ అవుట్ చేసి ఆ జట్టుకు షాకిచ్చాడు. అనంతరం మానవ్ సుతార్ శ్రీలంకను దెబ్బ మీద దెబ్బకొట్టాడు. వరుసగా దినేశ్ చండీమాల్(4), లాహిరు కుమార(27)లను పెవిలియన్ పంపాడు. కమిందు మెండిస్(14)కు కుల్దీప్ చెక్ పెట్టగా.. కెప్టెన్ ధనుంజయ డె సిల్వ(21)ను జడేజా అవుట్ చేశాడు. దీంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో సోనాల్ దినూష, నిరోషన్ డిక్వెల్లా ఆ జట్టును ఆదుకున్నారు. దినూష(100) సెంచరీతో రెచ్చిపోగా.. డిక్వెల్లా(80) కూడా రాణించాడు. ఆఖరికి దినూషకు జడేజా చెక్ పెట్టగా.. డిక్వెల్లాకు ప్రసిద్ధ్ కళ్లెం వేశాడు. నువాంత(2)ను కూడా జడేజానే అవుట్ చేశాడు. ఇక మరోసారి స్పిన్ మంత్రం ప్రయోగించిన మానవ్ సుతార్.. వరుసగా ప్రభాత్ జయసూర్య(10), లాహిరు కుమార(10)లను అవుట్ చేసి శ్రీలంకను ఆలౌట్ చేశాడు. శ్రీలంక 285 పరుగులకే పరిమితం చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది.

**దినూష, డిక్వెల్లా పోరాటం..**

భారత బౌలర్ల ధాటికి శ్రీలంక ఆరంభంలో దారుణంగా తడబడింది. 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 284 పరుగులు చేస్తుందని ఎవరూ ఊహించలేదు. ఆ స్కోరు చేయడానికి కారణం దినూష, డిక్వెల్లా. తొలి 26 ఓవర్లలో భారత బౌలర్లు విజృంభించారు. ఐదు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత వారికి కళ్లెం వేశారు దినూష, డిక్వెల్లా. మిగతా బ్యాటర్లు తేలిపోయిన అదే పిచ్‌పై వీరు అసాధారణ పోరాటం చేశారు. భారత్ బౌలింగ్‌ను తట్టుకుని వీరు క్రీజులో పాతుకపోయారు. అద్భుతమైన బ్యాటింగ్ చేసి శ్రీలంకను పోటీలోకి తీసుకొచ్చారు. దినూష 168 బంతుల్లో 100 పరుగుల చేయగా.. డిక్వెల్లా 115 బంతుల్లో 80 రన్స్ చేశాడు. వీరు 6వ వికెట్‌కు 146 పరుగులు భారీ భాగస్వామ్యం జోడించారు. దీంతో శ్రీలంకను ఫాలో ఆన్ గండం నుంచి తప్పించారు.

# ప్రపంచ నంబర్ వన్‌కు షాక్ ఇచ్చిన ఆయుష్ శెట్టి



**విశ్వంభర, స్పోర్ట్స్:** తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్‌లో ఆడుతున్న భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. 21 ఏళ్ల ఈ కర్ణాటక కుర్రాడు పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ షి యుకి (చైనా)ని కంగుతినిపించాడు. గంట 13 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పోరులో ఆయుష్ 21-14, 13-21, 21-9 తేడాతో షి యుకిపై విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ఆరంభం నుంచే అద్భుతమైన స్మాష్‌లతో వరుసగా పాయింట్లు సాధించి ప్రపంచ నంబర్ వన్‌కు గుబులు పుట్టించాడు. తర్వాత ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా ఆయుష్ పెద్దగా ఇబ్బంది లేకుండా గేమ్‌ను వశం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో షి యుకి పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. మూడో గేమ్‌లో ఆయుష్ శెట్టి 17-7తో భారీ ఆధిక్యంలో నిలిచి సునాయాసంగా విజయం సాధించేలా కనిపించాడు. కానీ, చైనా షట్లర్ అద్భుతంగా పుంజుకుని ఆధిక్యాన్ని 18-15కి తగ్గించాడు. అయినా, ఆయుష్ వెనక్కి తగ్గకుండా గొప్పగా పోరాడి తన కెరీర్‌లోనే చిరకాలం గుర్తుండే విజయాన్ని అందుకున్నాడు. అంతకుముందు మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జంట తొలి రౌండ్‌లో విజయం సాధించి రౌండ్ 32కు దూసుకెళ్లింది. ఈ జోడీ వరుస గేమ్‌ల్లో 21-9, 21-13 తేడాతో పౌలా-లూసియా (స్పెయిన్)ని చిత్తు చేసింది. పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్-హరిహరన్ జంట కూడా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. స్కాట్-రేమాండ్స్ (ఐర్లాండ్) జంటతో జరిగిన తొలి రౌండ్‌లో అర్జున్ ద్వయం తొలి గేమ్‌ను 21-16తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో భారత జోడీ 1-0 ఆధిక్యంలో ఉండగా ఐరిష్ ద్వయం రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగింది. దీంతో అర్జున్-హరిహరన్ జంట ముందంజ వేసింది.

## పి.వి.సింధు శుభారంభం



**విశ్వంభర, స్పోర్ట్స్:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. దిల్లీ వేదికగా ఇవాళ మొదలైన ఈ టోర్నీలో స్టార్ షట్లర్ పి.వి.సింధు తొలి రౌండ్‌లో సూపర్ విక్టరీ సాధించింది. మహిళల సింగిల్స్ రౌండ్ 64లో సింధు 21-7, 21-11 తేడాతో సోఫియా నోబెల్ (ఐర్లాండ్)ను మట్టికరిపించింది. తొమ్మిదో సీడ్ అయిన సింధు.. తొలి గేమ్‌ను సునాయాసంగా సొంతం చేసుకుంది. ప్రపంచ 141వ ర్యాంకు ప్లేయర్ అయిన సోఫియా రెండో గేమ్‌లో పోరాడింది. ఒక దశలో 10-8 నిలిచి ఆధిక్యంలోకి వెళ్లేలా కనిపించింది. కానీ, తర్వాత సింధు పుంజుకుని వరుసగా పాయింట్లు సాధించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

# ఐపీఎల్ ట్రేడింగ్ వివరాలు బయటపెట్టాలి..

## బీసీసీఐని డిమాండ్ చేసిన గవాస్కర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ సీజన్ ప్రారంభమవడానికి ముందు ప్లేయర్ల ట్రేడ్ ప్రక్రియ గురించి అందరికీ తెలిసిందే. క్యాష్ డీల్, ప్లేయర్ స్వాప్ ద్వారా ఆటగాళ్ల ట్రేడ్ జరుగుతుంది. ఇప్పటి వరకు చాలా మంది ఆటగాళ్లు ట్రేడ్ ద్వారా ఒక్క ఫ్రాంచైజీ నుంచి మరో ఫ్రాంచైజీకి మారారు. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీ మారుతున్నట్టు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్.. బీసీసీఐ ముందు కీలక డిమాండ్ పెట్టాడు. బీసీసీఐ, ఫ్రాంచైజీలు ట్రేడింగ్ వివరాలను బయటపెట్టాలన్నాడు. 'ఒక ఫ్రాంచైజీ నుంచి మరో ఫ్రాంచైజీకి ప్లేయర్లు మారుతున్నారంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ట్రేడ్ విండో ముగియడానికి ఇంకా సమయం ఉంది. అయితే, ఒక ఫ్రాంచైజీ నుంచి మరో ఫ్రాంచైజీకి ఆటగాడు బదిలీ విషయం బహిరంగంగా తెలుస్తుంది. కానీ, ఎంత ట్రేడింగ్ జరిగిందనేది మాత్రం రెండు ఫ్రాంచైజీలకు, బీసీసీఐకి, ప్లేయర్‌కు మాత్రమే తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఫ్రాంచైజీ తమ జట్టు కోసం నిర్దేశించుకున్న శాలరీ క్యాప్ పరిమితిని పాటించారా?లేదా? అన్న విషయం ఇతర ఫ్రాంచైజీలకు తెలియదు. అందుకే పూర్తి పారదర్శకత కోసం సదరు ప్లేయర్ ఎంతకు ట్రేడ్ అయ్యేడనే వివరాలను బయటపెట్టాలి. ఐపీఎల్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమమైన లీగ్. దాన్ని వేలెత్తి చూపించకుండా ఉండేందుకు పారదర్శకత పాటించడం కీలకం'అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

# పీఎస్‌బీలు బ్యాంకింగ్ సంస్కరణల తదుపరి దశకు సిద్ధం కావాలి




**విశ్వంభర, బిజినెస్:** భారత్ లక్ష్యంగా పెట్టుకున్న 'వికసిత్ భారత్ 2047' దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) తమ ఆర్థిక స్థితిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. పీఎస్‌బీలు ఇప్పుడు గతంలో ఎదుర్కొన్న మొండి బకాయిల సమస్య నుంచి చాలావరకు బయటపడ్డాయి. సమర్థంగా ఉన్న బ్యాలెన్స్ షీట్లను కేవలం రిస్క్ తగ్గించుకోవడానికి కాకుండా, దేశ తదుపరి దశ ఆర్థిక వృద్ధికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన ఆర్థిక సంస్థల అధిపతుల సమావేశంలో మాట్లాడిన ఆర్థిక మంత్రి, భారత బ్యాంకింగ్ చరిత్రలోనే ఎన్‌పీఏలు అత్యల్ప స్థాయికి చేరాయని, కాబట్టి ఇప్పుడు సంస్కరణలు చేపట్టడానికి ఇంతకంటే మంచి సమయం ఉండదని అన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకింగ్ రంగాన్ని సమీక్షించేందుకు త్వరలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకింగ్ రంగం నుంచి వచ్చే సూచనలు ఈ కమిటీకి ఉపయోగపడతాయని, సిఫార్సులు వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకునేలా అవి దోహదపడతాయని చెప్పారు. 2047 లక్ష్యానికి 20 ఏళ్ల కంటే తక్కువ సమయమే ఉందని గుర్తుచేస్తూ, భవిష్యత్ ఆర్థిక అవసరాలకు తగ్గట్టుగా బ్యాంకులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చెప్పారు. దేశ జనాభాలో 29 శాతం ఉన్న 15-29 ఏళ్ల యువతకు విద్యా రుణాలు, స్టార్టప్ ఫండింగ్, పెట్టుబడి ఉత్పత్తులను మరింత దగ్గర చేయాలని ఆర్థిక మంత్రి బ్యాంకులను ఆదేశించారు. సాంకేతికత మార్పులు, వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా డిపాజిట్ల సమీకరణను పెంచడం, వ్యవసాయ రంగంలో కేవలం పంట రుణాలే కాకుండా ప్రాసెసింగ్, కోల్డ్ చైన్‌లు, లాజిస్టిక్స్ వంటి వాల్యూ-చెయిన్‌లకు నిధులు అందించడం వంటి అంశాలపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ దృష్టి సారించింది. బ్యాంకులు రిస్క్ నియంత్రణలు పాటిస్తూ క్రెడిట్ కార్డ్ విభాగాన్ని విస్తరించాలని, సరికొత్త ఉత్పత్తులతో కస్టమర్ సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# లలితా జువెలరీ ఐపీఓ.. 69 శాతం సబ్‌స్క్రిప్షన్ పూర్తి

**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ ఆభరణాల తయారీ కంపెనీ లలితా జువెలరీ మార్ట్ పబ్లిక్ ఇష్యూకు తొలిరోజు రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. బిడ్డింగ్ విండో తెరుచుకున్న తొలిరోజే 69 శాతం సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. 6,27,61,403 షేర్లకు 4,35,37,826 బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ ఇన్వెస్టర్లు కోటా 74 శాతం, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 67 శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 61 శాతం సబ్‌స్క్రిప్షన్ నమోదు చేశాయి. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటికే రూ.508 కోట్ల నిధులను కంపెనీ సమీకరించింది. రూ.1700 కోట్ల ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కోషేరు ధరల శ్రేణి రూ.190-201గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ ప్రైస్ బ్రాండ్‌తో పోలిస్తే 15 శాతం అధికంగా గ్రే మార్కెట్ ప్రీమియం పలుకుతోంది. ఆగస్టు 24న మార్కెట్‌లో లిస్టయ్యే అవకాశం ఉంది.

**హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్ 14%..**

బ్లాక్‌స్టోన్ మద్దతు కలిగిన హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్ ఐపీఓ తొలిరోజు 14 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. 25,13,56,273 షేర్లకు గాను 3,52,85,000 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ ఇన్వెస్టర్ల కోటా 19 శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ కోటా కింద 3 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటికే రూ.1,167.8 కోట్ల నిధులను సమీకరించింది. రూ.2600 కోట్ల ఐపీఓ ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కోషేరు ధరల శ్రేణి రూ.57- 60గా కంపెనీ నిర్ణయించింది.

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జీడీపీ 7 శాతమేనన్న ఇక్రా



**విశ్వంభర, బిజినెస్ బ్యూరో:** భారత ఆర్థికవ్యవస్థ వృద్ధి రేటుకు బ్రేకులు పడే సూచనలు కనిపిస్తున్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'ఇక్రా' అభిప్రాయపడింది. తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి గతంలో కంటే తగ్గనుంది. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పరిమితం కానుందని ఇక్రా అంచనా వేసింది. గత మార్చి త్రైమాసికంలో నమోదైన 7.8 శాతంతో పోలిస్తే ఇది తగ్గడమే కాకుండా, గత నాలుగు త్రైమాసికాలలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సేవా రంగంలో వేగం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ జూన్ త్రైమాసికంలో పారిశ్రామిక రంగం 7.7 శాతం, సేవా రంగం 7.9 శాతం, వ్యవసాయ రంగం 4 శాతం మేర వృద్ధి నమోదు చేయనున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ, మన దేశంలో పారిశ్రామిక, సేవా రంగాల వ్యాపార పరిమాణం ఇప్పటికీ ఆశాజనకంగానే ఉందని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం మరింత ముదరడం, రుతుపవనాలపై అనిశ్చితి కొనసాగితే వృద్ధి అంచనాలకు మరింత డౌన్‌సైడ్ రిస్క్ ఉంటుందని నాయర్ పేర్కొన్నారు. మొత్తం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి రేటు గత ఏడాది నమోదైన 7.7 శాతం నుండి 6.7 శాతానికి తగ్గవచ్చని ఇక్రా భావిస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం, పెరిగిన ఇంధన ధరలు, వేతన ఖర్చుల భారం సేవా రంగాన్ని దెబ్బతీశాయని, దీనివల్ల ఈ రంగంలోని కంపెనీల సానుకూల ధోరణి గత ఐదేళ్లలోనే అత్యంత దిగువకు చేరిందని తెలిపింది.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా రెండో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఐదో రోజూ నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 77,892.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,009.25) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 77,453.75 వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ... చివరికి 281.09 పాయింట్ల పతనమై 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,394.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# శ్రీలంకతో తొలి టెస్టు.. అరుదైన క్లబ్‌లో రవీంద్ర జడేజా

**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో మరో రికార్డు అందుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు 350 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేశర నువాంతను ఔట్ చేసి ఈ ఘనత అందుకున్నాడు. 2012లో టెస్టు క్రికెట్ అరంగేట్రం చేసిన జడేజా.. తన 90వ మ్యాచ్‌లో 350 వికెట్ల క్లబ్‌లో చేరాడు. దీంతో భారత్ తరఫున 350 కంటే ఎక్కువ వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. అనిల్ కుంబ్లే (619 వికెట్లు), అశ్విన్ (537), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) ఈ జాబితాలో ఉన్నారు. అంతేకాకుండా టెస్టు క్రికెట్ చరిత్రలో 4 వేలకుపైగా పరుగులు, 350 వికెట్లు పడగొట్టిన నాలుగో ప్లేయర్‌గా జడేజా ఘనత సాధించాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్ (5248 పరుగులు, 434 వికెట్లు) అగ్రస్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ డానియల్ వెటోరి (4531 రన్స్, 362), ఇంగ్లాండ్ మాజీ పేస్‌ఆల్‌రౌండర్ ఇయాన్ బోథమ్ (5200 పరుగులు, 383 వికెట్లు) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

# హాకీ ప్రపంచ కప్.. ఇంగ్లాండ్ చేతిలో భారత్ ఓటమి



**విశ్వంభర, నెదర్లాండ్స్:** హాకీ ప్రపంచకప్‌లో భాగంగా సోమవారం పూల్-డిలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. మూడో ర్యాంకు జట్టు ఇంగ్లాండ్ 4-2 తేడాతో హర్మన్‌ప్రీత్ బృందంపై విజయం సాధించింది. తొలి అర్ధ భాగంలో 2-1తో ఆధిక్యంలో నిలిచిన భారత్.. రెండో అర్ధ భాగంలో మూడు గోల్స్ సమర్పించుకుని ఓటమి చవిచూసింది. 13వ నిమిషంలో నికోలస్ గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్ మొదలుకాగానే హర్మన్‌ప్రీత్ సింగ్ (16వ నిమిషం) గోల్ చేయడంతో స్కోరు సమం అయింది. దిల్‌ప్రీత్ సింగ్ (24వ నిమిషం) గోల్ కొట్టడంతో భారత్ 2-1తో ఆధిక్యం సంపాదించింది. అయితే, మూడో క్వార్టర్‌లో స్టువర్ట్ రష్‌మీర్ (38వ నిమిషం), హెన్రీ క్రాఫ్ట్ (42వ నిమిషం) గోల్స్ చేయడంతో ఇంగ్లాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. 54వ నిమిషంలో నికోలస్ మరో గోల్‌తో ఆ జట్టు తిరుగులేని స్థితిలో నిలిచి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. టోర్నీలో భారత్ ముందంజ వేయాలంటే బుధవారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తప్పక గెలవాలి.

# బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోయిన ఆసీస్ కు రెండు ఎదురు దెబ్బలు



**విశ్వంభర, స్పోర్ట్స్:** బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియా దారుణమైన ఓటమిని చవి చూసింది. తొలి టెస్ట్ లో సొంత గడ్డపై ఆస్ట్రేలియా ఓటమి పాలు అయింది. ఈ క్రమంలో ఆ జట్టుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్, హేడెన్, గిల్లీ లాంటి మాజీలు కూడా ఓ రేంజ్ లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టును ఉద్దేశించి నిప్పులు చెరుగుతున్నారు. ఇలాంటి క్రమంలో ఆస్ట్రేలియా జట్టుకు మరో రెండు ఎదురు దెబ్బలు తగిలాయి. మొదటి టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించడమే కాకుండా ఒక మ్యాచ్ పాయింట్ ను కోతగా విధించినట్లు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ టెస్టులో మూడో రోజు ఆటలో నాలుగు ఓవర్లను తక్కువగా వేసింది ఆస్ట్రేలియా. ఐసీసీ రూల్స్ ప్రకారం ఒక్కో స్లో ఓవర్ కు ఒక పాయింట్ కోత పడుతుందన్న సంగతి తెలిసిందే. అంటే ఈ లెక్కన ఆస్ట్రేలియాకు నాలుగు పాయింట్లు వరకు కోత విధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఒక్కో ఆటగాడిపై ఐదు శాతం జరిమానా కూడా పడే ప్రమాదం పొంచి ఉంది. ఇలా చూసుకున్నట్లయితే 11 మంది ఆటగాళ్లపైన 4వేల డాలర్ల చొప్పున 44,000 డాలర్ల వరకు ఫైన్ పడే ప్రమాదం ఉంది.



ఆ ముగ్గురు దర్శకులతో పనిచేయడమే నా కల

బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ అనన్య పాండే అతి తక్కువ సమయంలోనే వైవిధ్యమైన పాత్రలో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఆశించినంత స్థాయిలో రాణించకపోవడంతో కొంత గ్యాప్ తీసుకున్నారు. ఈనేపథ్యంలోనే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన హాట్ ఫొటోలు షేర్ చేస్తున్న అనన్య పాండే తాజాగా ఒక ఇంటర్వ్యూలో భాగంగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సోషల్ మీడియాలో వ్యాపించే నెగెటివిటీ, ట్రోలింగ్‌తో సతమతమయ్యే వారికి ఆమె ఒక మంచి సలహా ఇచ్చారు. ఆన్‌లైన్ నెగెటివిటీని చూసి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మనపై నెగెటివిటీ లేదా ట్రోలింగ్ వచ్చినప్పుడు కాస్త ప్రశాంతంగా వెనక్కి తగ్గి ఆలోచిస్తే, ఈ పరిస్థితి కేవలం మన ఒక్కరికే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ ఎదురవుతోందని అర్థమవుతుందని అన్నారు. సమాజంలో ఎంతో విజయవంతంగా, అత్యంత ఆత్మవిశ్వాసంతో కనిపించే వ్యక్తులు కూడా ఇలాంటి ఆన్‌లైన్ విమర్శలను ఎదుర్కొంటున్నారని గ్రహిస్తే, దానికి ఉండే శక్తి, భయం పూర్తిగా తగ్గిపోతాయని అనన్య వివరించారు. ఇక చిత్రపరిశ్రమలో తాను ఇప్పటివరకు కలిసి పనిచేయని కొందరు దిగ్గజ దర్శకులతో పనిచేయాలని ఉందని తన కోరికను బయటపెట్టారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకులు కరణ్ జోహార్, జోయా అక్తర్, సంజయ్ లీల భన్సాలీలతో పనిచేయడం తన డ్రీమ్ లిస్ట్‌లో ఉందని వెల్లడించారు. ఈ ముగ్గురు అగ్ర దర్శకుల దర్శకత్వంలో నటించే అవకాశం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అనన్య స్పష్టం చేశారు.

## జై శ్రీరామ్ వివాదం.. అనసూయపై పోలీసులకు ఫిర్యాదు

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయపై పోలీసులకు ఫిర్యాదు అందింది. రీసెంట్ గా అనసూయ తన ఇన్ స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో.. జై శ్రీరామ్ పేరుతో కొందరు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. సనాతన ధర్మం ముసుగులో పెద్ద దొంగలు కూడా ఉన్నారని వ్యాఖ్యానించారు. దీనిపై విమర్శలు రావడంతో తన మాటలను వక్రీకరిస్తున్నారని, తాను అందరు హిందువుల గురించి మాట్లాడలేదని అనసూయ మరో వీడియో చేశారు. కేవలం మతం పేరుతో అరాచకాలు చేస్తున్న కొందరి గురించే చెప్పానని అన్నారు. తాను రాముడి భక్తురాలిని అని, తన కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని చెప్పారు. అయితే తాజాగా ఇదే వివాదానికి సంబంధించి బీజేపీ నాయకులు హైదరాబాద్ బోరబండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అనసూయ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. మతపరమైన అంశాలపై మాట్లాడేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే అనసూయ కేవలం సినిమాలతోనే కాకుండా సామాజిక, రాజకీయ అంశాలకు సంబంధించి మాట్లాడుతూ కూడా వార్తల్లో నిలుస్తుంటారు. మహిళల హక్కులు, ఇతర అంశాలపై సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ ఉంటారు.





## వరుస విజయాలతో జోరుమీదున్న అనిల్ రావిపూడి..

దర్శకధీరుడు రాజమౌళి 'మగధీర' లాంటి భారీ విజయాన్ని అందుకున్న తర్వాత కూడా తనను తాను కొత్తగా ప్రూవ్ చేసుకోవడానికి 'మర్యాద రామన్న' లాంటి చిన్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆ తర్వాత 'ఈగ' వంటి వైవిధ్యమైన చిత్రాన్ని తెరకెక్కించి తనలోని భిన్నమైన దర్శకుడిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఎంత స్థాయి విజయాలు అందుకున్నా.. ప్రయోగాత్మక సినిమాలు చేయడానికి రాజమౌళి ఎప్పుడూ వెనుకాడలేదు. ఇక ప్రస్తుతం తెలుగులో ఒక్క అపజయం కూడా లేకుండా వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. తనదైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వరుస హిట్లు అందుకుంటున్నారు. ప్రస్తుతం వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమా తర్వాత అనిల్ రావిపూడి ఓ యానిమేషన్ సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. రామాయణం నేపథ్యంలో సాగే ఈ యానిమేషన్ చిత్రాన్ని కేవీఎన్ సంస్థ నిర్మించనుంది. రామాయణంలోని ప్రధాన ఘట్టాలను సమాహారంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించనున్నట్లు సమాచారం. పురాణ పాత్రలతో ఓ సినిమా చేయాలనే కోరిక అనిల్ రావిపూడికి ఎప్పటి నుంచో ఉందట. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆయన ఆ కోరికను నెరవేర్చుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈ యానిమేషన్ ప్రాజెక్ట్‌లో మరో ఆసక్తికరమైన విషయం ఉంది. సాధారణంగా సినిమాల కోసం దర్శకులు స్క్రిప్ట్ సిద్ధం చేస్తారు. కానీ అనిల్ రావిపూడి మాత్రం స్క్రిప్ట్‌తో పాటు ప్రతి సీన్, అందులోని డైలాగులు, ప్రతి పాత్ర చూపించాల్సిన హావభావాలను సైతం తానే నటించి రికార్డ్ చేశారట. వాటి ఆధారంగానే యానిమేటర్లు సన్నివేశాలను డిజైన్ చేస్తున్నట్లు సమాచారం. వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో అనిల్ రావిపూడి ఇలా ఓ వైవిధ్యమైన యానిమేషన్ ప్రాజెక్ట్‌ను ఎంచుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ విషయంలో ఆయన రాజమౌళి బాటలో నడుస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## ఇమ్రాన్ హష్మీ-జెనీలియా కాంబోలో హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా..

బాలీవుడ్ స్టార్ హీరో ఇమ్రాన్ హష్మీ ఇటీవల 'ఆవారాపన్-2' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 'ఆవారాపన్' సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య వచ్చి థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. అయినప్పటికీ ఇమ్రాన్ హష్మీ ఏమాత్రం నిరాశ చెందకుండా తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించి అభిమానుల్లో కొత్త ఆశలను చిగురించేలా చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఆదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఒక విభిన్నమైన కథాంశంతో, పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'గన్‌మాస్టర్ జీ9' అనే టైటిల్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రాజెక్ట్‌లో ఇమ్రాన్ హష్మీకి జోడీగా జెనీలియా హీరోయిన్‌గా నటిస్తుండగా, వర్సటైల్ నటుడు అపరశక్తి ఖురానా ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. అంతేకాకుండా, ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు హిమేష్ రేష్మియా స్వరాలు సమకూరుస్తుండటం విశేషం. ఈ భారీ చిత్రాన్ని దీపక్ ముకుట్, సంగీత అహిర్, హునర్ ముకుట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోహం రాక్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇమ్రాన్ హష్మీ ఈ సినిమాకు సంబంధించిన విడుదల తేదీని కూడా ప్రకటిస్తూ ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ హై-వోల్టేజ్ యాక్షన్ మూవీని 2026 నవంబర్ 27న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇమ్రాన్ హష్మీ, జెనిలియా కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.



## ఫ్యాక్టరీలో తయారైన ప్లాస్టిక్ బొమ్మను కాను..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సయామీ ఖేర్ త్వరలో 'హైవాన్' మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ కాంబోలో రాబోతున్న ఈ సైకలాజికల్ డ్రామాను ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో బోమన్ ఒరానీ, రాజేష్ శర్మ, శ్రియా పిల్గావ్కర్, రాజ్‌పాల్ యాదవ్, షరీబ్ హష్మీ, పహల్ చౌదరి కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను సెప్టెంబర్ 11న థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నారు. దీంతో అప్పుడే ప్రమోషన్స్ జోరు పెంచిన మూవీ మేకర్స్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా సయామీ ఖేర్ బాలీవుడ్‌లో ఉండే కండీషన్ల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్‌లో నటీమణులు ఎలా కనిపించాలి, ఎలాంటి దుస్తులు ధరించాలనే విషయాలపై ఉండే ఒత్తిడి గురించి ఓపెన్‌గా మాట్లాడారు. తన కెరీర్ ప్రారంభంలో చాలామంది నిర్మాతలు తనకు రకరకాల సలహాలు ఇచ్చారని తెలిపారు. ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలదొక్కుకోవాలంటే ఒక పద్ధతి ప్రకారం మాత్రమే కనిపించాలని, అందరిలాగే డ్రెస్సింగ్ స్టైల్ మార్చుకోవాలని తనపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. చివరకు తన సహజమైన ఉంగరాల జుట్టును కూడా తీసివేయమని చాలామంది చెప్పారని ఆమె వెల్లడించారు. అయితే అందరి మాటలు విని అలా మారిపోతే ఒక ఫ్యాక్టరీలో తయారైన బార్బీ బొమ్మలా మారిపోతానని భావించి, తన ఒరిజినాలిటీని కోల్పోవడానికి నిరాకరించానని తెలిపారు. ఇండస్ట్రీ నిబంధనలకు లొంగకుండా తనకు ఇష్టమైన క్రీడలపై దృష్టి పెడుతూ, స్వేచ్ఛగా విషయాలు మాట్లాడుతుంటూ తనలాగే ఉన్నానని చెప్పారు. తన తల్లిదండ్రులు నేర్పిన విలువలకే కట్టుబడి ఉండటం వల్లనే 'హైవాన్' లాంటి మంచి ప్రాజెక్ట్‌లో అవకాశం సాధించానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.



## 'స్పిరిట్' లో ప్రభాస్ ఇంట్రోపై భారీ హైప్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'స్పిరిట్' ఒకటి. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై భూషన్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కృష్ణన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. ప్రధాన అంశాలు చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ పాత్రలో కనిపించన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ప్రభాస్ ఎంట్రీ సీన్‌కు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ నెట్టింట వైరల్ అవుతున్నది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం మేరకు, సెంట్రల్ జైల్లో భారీ గందరగోళంతో సినిమా ఓపెన్ అవుతుందని, ఖైదీల భయంతోనే ప్రభాస్ పాత్ర పవర్‌ను ఎస్టాబ్లిష్ చేస్తారని టాక్. ముఖ్యంగా ఖాకీ యూనిఫామ్‌లో ప్రభాస్.. పాత హిందీ పాట వింటూ కూల్‌గా జైల్లోకి ఎంట్రీ ఇచ్చే సీన్ డిఫరెంట్‌గా ఉండబోతుందట. డ్రమ్స్, భారీ డైలాగ్స్‌కు బదులుగా సైలెంట్‌గా, డార్క్ అండ్ సైకోటిక్ మూడ్‌లో ప్రభాస్‌ను వంగా పరిచయం చేయనున్నారనే టాక్ ఫ్యాన్స్‌లో హైప్ పెంచుతోంది. కాగా.. ఈ మూవీలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుంది. హర్షవర్ధన్ రమేశ్వరన్ సంగీతం అందిస్తున్నాడు. వచ్చే ఏడాది మార్చి 5న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

## 36 ఏళ్ల వయసులో నటి అనుమానాస్పద మృతి..



ప్రముఖ హాలీవుడ్ నటి.. సూపర్‌హిట్ వెబ్ సిరీస్ 'హీరోస్' ఫేమ్ హేడెన్ పానెటెర్ 36 ఏళ్ల వయస్సులో హఠాన్మరణం చెందారు. ఆమె పుట్టినరోజు (ఆగస్టు 21)కు నాలుగు రోజుల ముందు ఈ విషాదం చోటుచేసుకుంది. హేడెన్ ఇక లేరనే వార్తను ఆమె ప్రతినిధి మీడియాకు అధికారికంగా వెల్లడించారు. ఆదివారం నటి కన్నుమూసినట్లు తెలిపారు. అయితే, ఆమె మృతికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 1989 ఆగస్టు 21న న్యూయార్క్‌లో జన్మించిన హేడెన్.. 11 నెలల వయసులోనే ఓ ప్రకటనలో నటించారు. 1994లో బాలనటిగా కెరీర్ ప్రారంభించారు. 'హీరోస్' సిరీస్‌లో క్లైర్ బెన్నెట్ పాత్రతో అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'నాష్‌విల్లె', 'రిమెంబర్ ది టైటాన్స్', 'స్క్రీమ్ 4' వంటి హిట్ సినిమాలతో పాటు టీవీ షోల్లోనూ మెప్పించారు. ఈ ఏడాదే ఆమె 'దిస్ ఈజ్ మీ: ఎ రెకనింగ్' పేరుతో తన ఆత్మకథను విడుదల చేశారు. చిన్న వయసులోనే సినీ పరిశ్రమలోకి రావడం వల్ల ఎదుర్కొన్న సవాళ్లు, మానసిక ఒత్తిడి, అడిక్షన్ సమస్యల గురించి అందులో ఆమె ప్రస్తావించారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com